www.peoplesnews.in

# హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 53 బుధవారం, జూలై 08, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

**రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు**

**పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్**

**సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఉపయుక్తం**

**కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు**



**హైదరాబాద్,జూలై7 :** పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రా యపడ్డారు.

మిగతాది 2లో...



# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

**182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం**

**సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం -కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై7 :** తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం

మిగతాది 2లో...




# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**అహ్మదాబాద్,జూలై7 :** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది.

మిగతా 2లో...



# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

**రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు**

**నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**రంగారెడ్డి,జూలై7 :** రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి

మిగతాది 2లో...





# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

**ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్**

**న్యూఢిల్లీ,జూలై7 :** పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ర కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు.

మిగతాది 2లో...

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

**ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన**

**ఈ25 పెట్రోల్ పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన**

**వాహనాలపై ఈ25 అనుకూలతపై ఇంకా పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడి**

**ఈ20 పెట్రోల్ పై మైలేజ్, ఇంజిన్ పనితీరుపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు**

**దశలవారీగా, ఆచితూచి మాత్రమే ముందుకు వెళ్తామని ప్రభుత్వ హామీ**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే

మిగతాది 2లో...





# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**ఇంటింటి సర్వే జరపకుండా మజ్లిస్ శిబిరాల్లో ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపణ**

**బీఎల్‌ఓలు నిబంధనలు పాటించడం లేదని ఈసీకి ఫిర్యాదు**

**తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నేతలు**



2లో.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు


**పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం**

**జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు**

**ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి**

**ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లింపు**

**చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం లో కీలక నిర్ణయాలు**



**అమరావతి,జూలై7 :** సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూములిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూము లు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంఠాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10 వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయిం చింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతు ంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశ ంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్,

మిగతాది 2లో...



# భోగాపురం సిద్ధం..

**విమానాశ్రయం త్వరలో ప్రారంభం**

**భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు**

**అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి**

**మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి**

**ఉత్తరాంధ్ర :** ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే

మిగతాది 2లో...

# భోగాపురం సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

హైదరాబాద్ పాతబస్తీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసిన ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరగడం లేదని, దానికి బదులుగా మజ్లిస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారానే ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఫారాల పంపిణీకే పరిమితం కాకుండా, పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు వినియోగించే ఎన్నికల సంఘం అధికారిక యాప్‌ను సైతం మజ్లిస్ నేతలకే అప్పగిస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో పేర్కొంది. పాతబస్తీతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చాలామంది ఓటర్లకు కనీసం దరఖాస్తు ఫారాలు కూడా అందలేదని వివరించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ సందర్భంగా పలు అంశాలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లింది. హైదరాబాద్‌లో కేవలం ఆంగ్ల భాషలో, జిల్లాల్లో తెలుగులో ఫారాలను పంపిణీ చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇంటింటి సర్వేను తప్పనిసరి చేయాలని, ఓటర్లు అందుబాటులో లేని పక్షంలో బీఎల్ఓలు కనీసం మూడుసార్లు వారి ఇళ్లను సందర్శించేలా ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఓటర్ల జాబితా సవరణ కోసం జూన్ 25న ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగనుంది. జూలై 31న ముసాయిదా జాబితాను, అక్టోబర్ 1న తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

(మొదటి పేజీ తరువాయి)

లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాము లయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# చరిత్ర సృష్టించిన మోదీ..

## ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని



**జకార్తా** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు.

భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# అంబేద్కర్ నగర్ (గువ్వలగూడెం)లో ఘనంగా జరిగిన 32వ, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

- ప్రతి మాదిగ, ఉపకులాల పిల్లలు ఉన్నత చదువులు చదవాలి
- వర్గీకరణ ఫలాలు అందిపుచ్చుకోవాలి...
- బొల్లికొండ వెంకటనారాయణ, వంగూరి మహేష్ రావ్.

**అంబేద్కర్ నగర్/ గువ్వలగూడెం/ఖమ్మం/జులై 07/(పీపుల్స్ న్యూస్)**
అంబేద్కర్,గువ్వల గూడెం గ్రామంలో, వంగూరి మహేశ్వరరావు అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం గ్రామంలో పండుగలా జరిగింది,జెండా ఆవిష్కరణ చేసారు. జెండా ఆవిష్కరణ గ్రామంలో వికలాంగుల నాయకుడు కొలికపొంగు నాగేశ్వరరావు, గ్రామ పెద్ద మాదిగ, వంగూరి పెద్ద బంగారు, కొలిక పొంగు నరసయ్య, జెండా ఎగరవేసారు . ఈ కార్యక్రమం ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బొల్లికొండ వెంకటనారాయణ మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ స్థాపించిన ఉద్యమం గురించి వారు సాధించిన ఉద్యమ ఫలాల గురించి వర్గీకరణ యొక్క ఫలాలు జాతి బిడ్డలు పొందాలంటే ప్రతి ఒక్క కుటుంబంలోని పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి అప్పుడు మాత్రమే వర్గీకరణ కోసం పోరాడిన మంద కృష్ణ మాదిగ, ఉద్యమ, పోరాట,ఫలితాన్ని ప్రభుత్వ కొలువుల రూపం లో,పొంది కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని వివరించడం జరిగింది అలాగే ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న ఉద్యమ నాయకుడు మాదిగల ఆరాధ్య దైవం చిన్నపిల్లల గుండె చప్పుడు, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీల హక్కులసాధనకై పోరాడే అభినవ అంబేద్కర్,మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసారు. చివరగా వంగూరి మహేశ్వర రావు,



మాట్లాడుతూ గ్రామ ప్రజలు మందకృష్ణ మాదిగ, ఉద్యమం కోసం ఎప్పుడు పిలుపునిచ్చిన అందరూ కలిసి విజయవంతం చేయడం కోసం కలిసి పనిచేస్తామని, ప్రజలు కూడా కలసిరవాలని, పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు కొత్తపల్లి యేసు మాదిగ, మాతంగి నాగయ్యమాదిగ,మాతంగి శ్రీను మాదిగ, కొలికపొంగు వీరబాబు మాదిగ,బొల్లికొండ ప్రభాకర్, శ్రీనాథ్ మాదిగ , కొలికపొంగు వెంకటేశ్వర్లు మాదిగ ,వంగూరి కోటయ్య మాదిగ,కొలికపొంగు బుచ్చమ్మ, మేనల ధనమ్మ,వంగూరి నీలమ్మ, కొలికపొంగు సుగుణ, వంగూరి రత్న,కొలికపొంగు వీరమ్మ. యువకులు, పిల్లలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నోటఫికేషన్ ను విడుదల చేయాలి.

**--బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు**



**ఖమ్మం /జులై 07/(పీపుల్స్ న్యూస్ )**
రాష్ట్రంలో 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని నేలకొండపల్లి బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం 7,347 వేల పోలీస్ ఉద్యోగాలకే నోటిఫికేషన్ జారీ చేసి చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో సుమారు 19 వేల పైగా పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆర్టిఐ ద్వారా బహిర్గతమవటమే కాక, తెలంగాణ రాష్ట్ర డీజిపి సీ. వి. ఆనంద్ తన నివేదిక లో వెల్లడించారు. కానీ కేవలం 7,347 వేల పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామనడం సరైంది కాదన్నారు. ఈ నోటిఫికేషన్ వల్ల 15 లక్షల మంది అభ్యర్థులు నైరాశ్యంలోకి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత తీవ్ర అగ్రహంతో ఉన్నారని, ఇప్పటికైనా వారికి ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

# దోపిడీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్) :**
దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి వివో సెల్ ఫోన్, నగదు , యాక్టివా స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్ళితే.... గత నెల 27న మధ్యాహ్నం 12:50 గంటలకు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్, గణేష్ నగర్ (గాయత్రి మెడికల్ స్టోర్ ఎదురుగా, ఎంఎస్ హోటల్ సమీపంలో) నివసించే పూజా సతీ (36) పాన్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే ఆమె తాను గత రెండేళ్లుగా ఆప్కో కాలనీలో పాన్ షాప్ నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 04:00 గంటలకు షాప్ తెరిచి, రాత్రి 10:00 గంటలకు మూసివేస్తుంటారు. ఈ క్రమంలో గత నెల 26న రాత్రి సుమారు 09:40 గంటల సమయంలో ఆమె తన పాన్ షాప్ మూసివేసి, కాలినడకన ఇంటికి బయలుదేరారు. కాటేదాన్ లోని 'కనక్ బేకరీ' సమీపానికి చేరుకోగానే, ఒక యాక్టివా మోటార్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు అపరిచిత వ్యక్తులు ఆమె ముఖం , తలపై చేతులతో దాడి చేసి, ఆమె వద్ద ఉన్న మొబైల్ ఫోన్ రూ. 4,500 నగదును బలవంతంగా లాక్కొని ఘటనా స్థలం నుండి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు, నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఘటనా స్థలంలోని సిసిటివి ఫుటేజీలను నిశితంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను కిషన్‌బాగ్ కు చెందిన మహ్మద్ గౌస్ (19) , మైలార్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన వడ్ల చందు (19 ) ఆత్మరాజ్ వికాస్ (21) గుర్తించి, మంగళవారం ముగ్గురు నిందితులను విజయవంతంగా అదుపులోకి తీసుకున్నారు ఒక నేవీ బ్లూ కలర్ యాక్టివా స్కూటర్, ఒక వివో సెల్ ఫోన్, రూ. 1,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ ఎ. సుధాకర్ పర్యవేక్షణ , మార్గదర్శకత్వంలో మైలార్‌దేవ్‌పల్లి ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ, డిఐ మక్సూద్ అలీ , క్రైమ్ విభాగం సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. క్షేత్రస్థాయిలో సాంకేతిక ఆధారాలను సేకరించి, నిందితులను పట్టుకోవడంలో దొంగిలించబడిన సొత్తును రికవరీ చేయడంలో సమర్థవంతంగా పనిచేసిన క్రైమ్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# మెరుగైన విద్యాబోధన అందించాలా .. ఈ బోకస్ సంఘాలను ఎదుర్కోవాలా

**- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి**

**కుత్బుల్లాపూర్, జూలై 7 (పీపుల్స్ న్యూస్) :**
మెరుగైన విద్యాబోధన అందించాలా లేదా ఈ బోకస్ సంఘాలను ఎదుర్కోవాలా అనేది ఒక సవాలుగా మారిందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని నాంపల్లి లో గల కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో ట్రస్మా రాష్ట్ర బాడీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. స్వచ్ఛందంగా మధ్యతరగతి విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్న ఎకనామికల్ విద్యాసంస్థల పట్ల బోకస్ విద్యార్థి సంఘాలు ఒక శాపం లా మారాయన్నారు. గతంలో విద్యార్థి సంఘాల్లో పనిచేసిన వారు , బోకస్ విద్యార్థి సంఘాలు పెట్టుకొని ఆర్టీఐ యాక్ట్ ని భూతంలా చూపిస్తూ విద్యాసంస్థల లో , ప్రమాణాలు లేవని అదే పనిగా వారి జీవన ఆధారంగా పెట్టుకుని ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కుల సంఘాలా పేరు పెట్టుకుని కొని స్కూల్స్ కి ఎలాంటి సంబంధం లేనప్పటికి వారు కూడా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ట్రస్మా జనరల్ సెక్రెటరీ కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ స్థానిక ఎంఈఓ లను అసౌకర్యానికి గురి చేసి వారితో లెటర్స్ సర్వ్ చేయించి బ్లాక్మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది జాయింట్ యాక్షన్ కమిటీ అని అవతారం ఎత్తి ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వీరిని తట్టుకోలేక కొన్ని




విద్యాసంస్థలు మూత పడిపోయాయన్నారు. స్కూలో బుక్స్ అనే విషయానికి వస్తే స్కూల్స్ యజమాన్యం వారు థర్డ్ పార్టీకి బుక్స్ అమ్ముకోనికి సౌకర్యం కలిగించి వారికి డిస్కౌంట్ లో బుక్స్ అమ్మనీకి పేరెంట్స్ కి వసతి కల్పిస్తున్నారన్నారు. విద్యాసంస్థలే అమ్ముతున్నాయని విద్యాసంస్థల పై అరాచకంగా దాడి చేస్తున్నారన్నారు. స్కూల్ ఫీజు విషయంలో స్కూల్స్ ఒక్క గవర్నింగ్ బాడి నిర్ణయించిన దాన్ని అమలుపరుస్తున్న తరుణంలో వీరు కూడా దాన్ని ఛాలెంజ్ చేస్తూ అవిట్లలో జోక్యం కలిగించుకొని సాఫ్ట్ గా నడుస్తున్న సంస్థని అల్లరి పాలు చేస్తున్నారన్నారు. ట్రస్మా ట్రెజరర్ కె. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 12 వేల ఇలాంటి విద్యాసంస్థలు అందులో ఐదు లక్షల మంది విద్యా , విద్యా బోధన , విద్యా బోధన హేతు సిబ్బంది ఉన్నారని ఇందులో దాదాపు 35 లక్షల మంది విద్యార్థులు విద్యాబోధన అందుకుంటున్నా రన్నారు. ఇలాంటి విద్యాసంస్థలలో విద్యను అభిషేకించి ఎన్నో ఉన్నతమైన శాఖలలో కొనసాగుతున్నారన్నారు. ఇలాంటి సంస్థల మనుగడ ఉండాలని ట్రస్మా రాష్ట్ర కమిటీ డిజిపి సీవీ ఆనంద్ ని కలిసి వారికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన స్పందిస్తూ అన్ని పోలీస్ స్టేషనులకు అలర్ట్ జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదే విషయమై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నవీన్ నికోల్లాస్ కి కూడా వినతిపత్రం అందజేశామని, బ్యాంక్ , హాస్పటల్స్ కి ఏ విధంగానైతే రక్షణ కల్పిస్తారో అదే విధంగా స్కూల్స్ కూడా రక్షణ కల్పించే జీవోపై సమీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ రామేశ్వర్ రెడ్డి , వైస్ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి , పెద్ద ఎత్తున స్కూల్స్ మేనేజ్మెంట్ బీ.ఆంజనేయులు, వినోద్ జాదవ్, సి.హెచ్.నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఛాత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**- అక్రమ మద్యం, ద్విచక్ర వాహనాలు స్వాధీనం, అనుమానితుల గుర్తింపు**






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్) :**
హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాల అణచివేత మరియు కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసే నిరంతర ప్రయత్నాలలో భాగంగా మంగళవారం సాయంత్రం చార్మినార్ జోన్ లోని ఛాత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. మేకల మండి ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన నమ్మదగిన సమాచారం ఆధారం గా ఈ ఆపరేషన్ చేపట్టారు. అక్రమ మద్య వ్యాపారాన్ని అరికట్టడం, అనుమానాస్పద వ్యక్తులు , వాహనాలను తనిఖీ చేయడం, నేరాలను అదుపు చేయడం , పోలీసింగ్‌పై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించే లక్ష్యంతో చార్మినార్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఖారే, ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ ఆపరేషన్‌లో భారీ సంఖ్యలో పోలీస్ బలగాలు పాల్గొన్నాయి. ఇందులో 02 మంది అసిస్టెంట్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్ , 09 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్లు , 13 మంది సబ్ ఇన్స్పెక్టర్లు , 159 మంది ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు. సదరు ప్రాంతాన్ని పూర్తిగా జల్లెడ పట్టేందుకు వీలుగా బలగాలను వ్యూహాత్మకంగా 07 సెర్చ్ పార్టీలు , 04 కట్-ఆఫ్ పార్టీలు ,04 లిఫ్టింగ్ పార్టీలు ,01 హోల్డింగ్ పాయింట్ మోహరించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా నిర్దేశిత ప్రాంతాలలో క్రమపద్ధతిలో ఇండ్ల తనిఖీలు చేపట్టారు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ధృవీకరించారు, వాహనాలను తనిఖీ చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంగణాలను నిశితంగా



పరిశీలించారు. ఈ తనిఖీలలో అనధికారిక విక్రయాల కోసం నిల్వ ఉంచిన 14 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ అక్రమ మద్యాన్ని ఈ ప్రత్యేక తనిఖీలలో స్వాధీనం చేసుకున్నారు. అక్రమ విక్రయాల కోసం కలిగి ఉన్న 105 మద్యం సీసాలను జప్తు చేశారు. అక్రమ మద్య వ్యాపారంలో పాలుపంచుకున్నట్లు తేలిన వ్యక్తులపై సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం అవసరమైన చట్టపరమైన చర్యలు ప్రారంభించబడుతున్నాయి సరైన పత్రాలు లేని , అనుమానాస్పద పరిస్థితుల్లో లభించిన 25 ద్విచక్ర వాహనాలను తదుపరి పరిశీలన నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు. సరైన అనుమతులు లేకుండా నిల్వ ఉంచినట్లు అనుమానిస్తున్న 02 ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను కూడా విచారణ కోసం జప్తు చేశారు. ముందస్తు రక్షణ/నివారణ పోలీసింగ్ చర్యలలో భాగంగా 04 గురు అనుమానితులను గుర్తించి, వారిని పూర్తి విచారణ ,స్క్రీనింగ్‌కు గురిచేశారు. నిబంధనల ఉల్లంఘనలు రుజువైన చోట తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. శాంతిభద్రతలను కాపాడటానికి, నేరాలను నివారించడానికి , పౌరులందరికీ సురక్షితమైన వాతావరణాన్ని నిర్ధారించడానికి చార్మినార్ జోనల్ పోలీస్ గట్టిగా కట్టుబడి ఉంది. నేరగాళ్లను నిరోధించడానికి , ప్రజా భద్రతను పెంపొందించడానికి ఇటువంటి ముమ్మర కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు క్రమంతప్పకుండా నిర్వహించబడతాయి.

# డ్యూటీలో ఉన్న ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణను కచ్చితంగా పాటించాలి

**- చార్మినార్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే**




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్):**
డ్యూటీలో ఉన్న ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణను కచ్చితంగా పాటించాలని చార్మినార్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే అన్నారు. మంగళవారం సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన జంక్షన్లు, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద తప్పనిసరిగా విధుల్లో కనిపిస్తూ, అప్రమత్తంగా ఉండి, ట్రాఫిక్‌ను నిరంతరం సజావుగా నియంత్రించాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ , ఎస్ఐలు, సిబ్బందిపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించి, సమయపాలన, విధి నిర్వహణ, కేటాయించిన పాయింట్లలో హాజరు, క్రమశిక్షణ మరియు నిర్దేశిత యూనిఫాం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ అమలు చర్యలను మరింత కఠినంగా చేప ట్టాలని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు వాహనాలు నడపడం, రాంగ్ రూట్/రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ మరియు వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం వంటి ఉల్లం ఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చివరగా, సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పనితీరును డీసీపీ అభినందించి, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ చాంద్రాయణగుట్ట చంద్రమోహన్ పాల్గొన్నారు.

## సైదాబాద్ ఫ్లైఓవర్‌ను పరిశీలించిన ట్రాఫిక్-III డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాహుల్ హెగ్డే బి.కె







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్) :**
సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సైదాబాద్ ఫ్లైఓవర్‌ను మంగళవారం ట్రాఫిక్-××× డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాహుల్ హెగ్డే బి.కె., చాంద్రాయణగుట్ట జోన్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి. చంద్ర కుమార్ లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూసేందుకు ప్రతిపాదించిన 'యు' టర్న్‌లు , ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు. ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను అంచనా వేసిన వారు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలను , ఆదేశాలను జారీ చేశారు. విధి నిర్వహణలో వృత్తిపరమైన ప్రవర్తన , సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు సిబ్బంది తమ రోజువారీ విధులను నిర్వర్తించడంలో ఎదుర్కొంటున్న సమస్యలు లేదా సవాళ్ల గురించి అడిగి తెలుసుకుని, వారికి అవసరమైన పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు

## సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ సీపీ (క్రైమ్స్) ఆకస్మిక తనిఖీ



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్) :**
సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం హైదరాబాద్ నగర అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్స్ ఙ సిట్) ఎం. శ్రీనివాసులు ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పనితీరును సమీక్షించారు. ఈ తనిఖీల్లో భాగంగా అడిషనల్ కమిషనర్ సైబర్ క్రైమ్ లాబొరేటరీని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు , వారి సిబ్బంది అంతా విధుల్లో ఉండి, తమకు కేటాయించిన కేసుల దర్యాప్తు పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆకస్మిక తనిఖీకి సంబంధించిన వివరాలను పోలీస్ స్టేషన్ జనరల్ డైరీ లో నమోదు చేశారు. సిబ్బంది యొక్క క్రమశిక్షణ, విధి నిర్వహణ పట్ల అడిషనల్ కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి. అరవింద్ బాబు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ , ఎస్హెచ్ఓ లు ఉన్నారు.

## మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

**రుద్రంపూర్, జూలై 07 :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సింగరేణి డైరెక్టర్ (పీ ఙ పీ) కె. వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి సంస్థ చేపడుతున్న హరిత కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని వికెసీఎం ప్రాజెక్టులో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని అందించేందుకు హరితహారం కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి చెట్టుగా పెంచినప్పుడే హరితహారం లక్ష్యం నెరవేరుతుందన్నారు.అనంతరం వికెసీఎం వ్యూ పాయింట్‌ను సందర్శించి ప్రాజెక్టులో జరుగుతున్న ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించారు. ఉత్పత్తి పురోగతి, యంత్రాల పనితీరు, భద్రతా ప్రమాణాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా, సమయానికి పూర్తి చేసేలా కృషి చేయాలని, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూనే ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, గనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను నిరంతరం పాటించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, ఎన్విరాన్‌మెంట్ జీఎం బి. సైదులు, వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.వి. నరసింహారావు, ఎస్ఓటీయూ జీఎం ఎం. గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజినీర్ వి. రామకృష్ణ, డీజీఎం (ఐఈడీ) ఎన్. యోహాన్, ఐఎన్‌టీయూసీ వైస్ ఏరియా అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలను చిన్నప్పటి నుంచే నేర్చుకుని ఆచరించాలి

మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సావిత్రి















**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్):**
ట్రాఫిక్ నియమాలను చిన్నప్పటి నుంచే నేర్చుకుని ఆచరించాలని మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సావిత్రి అన్నారు. మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు, డీసీపీ ట్రాఫిక్--× రాహుల్ రెడ్డి మార్గదర్శకత్వంలో మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఓల్డ్ ఆల్వాల్‌లోని లయోలా అకాడమీలో విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ ఙ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సావిత్రి మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన అలవడితే సురక్షిత సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ రోడ్ సేఫ్టీ రాయబారులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను పాటించడం, ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, లేన్ క్రమశిక్షణ పాటించడం, అతివేగం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన రహదారి వినియోగదారులుగా మారి తమ పరిసరాల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, రహదారులను మరింత సురక్షితంగా మార్చేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ట్రాఫిక్ ఙ రోడ్ సేఫ్టీ ఫోరం లీడ్ మురళీకృష్ణ , ఎ. త్రిముల్గెర్రీ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు, ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. పవన్ కుమార్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హరిలాల్, లయోలా అకాడమీ ప్రిన్సిపాల్ ఫాదర్ ఎస్. బి. బాబు, ఎస్.జె., వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఎ. ఎం. జోసెఫ్ కుమార్, ఎస్.జె. పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలి

- తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్









**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్) :**
వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పిలుపునిచ్చారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌ను సందర్శించి నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, రోడ్డు భద్రత, సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌పై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులతో క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించిన డీజీపీ బ్యాక్ టూ బేసిక్స్ అనే సందేశాన్ని ఇస్తూ నిజాయితీ, ప్రజలకు కనిపించే పోలీసింగ్ , నిష్పాక్షికత , సాంకేతికత , ఆధారంగా బలమైన, సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని సూచించారు. డీజీపీ రోడ్ సేఫ్టీ పార్కును ప్రారంభించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 250 సీసీటీవీ కెమెరాలను కమాండ్ సెంటర్‌కు అనుసంధానించిన వ్యవస్థను ప్రారంభించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన పోలీసు సిబ్బందిని అభినందించారు. పోలీసు సిబ్బంది, ప్రజలకు హెల్మెట్లు పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు.గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో సహకరించిన ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు.గ్రామాలు, విద్యాసంస్థల్లో యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా సమాజమంతా అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం బాధ్యతాయుతంగా పోలీసులకు అందించాలని కోరారు. "మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి... భావితరాలను కాపాడాలి" అని స్పష్టం చేశారు.పోలీస్ యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని పేర్కొంటూ, రాష్ట్రంలోని సుమారు 4.5 కోట్ల జనాభాలో కేవలం 0.16 శాతం మందికే ఈ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి ప్రజలకు సేవ చేయాలని సూచించారు.రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలని, సీసీటీఎన్ఎస్ లో సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రత కోసం ఈగల్ తరహాలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పేదలు, బలహీన వర్గాలకు చట్టప్రకారం న్యాయం చేయాలని, సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీసీటిఎన్ఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో ఫైనాన్స్ ఫ్రాడ్ కేసులు 30 శాతం, ఉద్యోగ మోసాల కేసులు 36 శాతం పెరిగినట్లు వెల్లడించారు. నకిలీ పత్రాలు, జీఎస్టీ సంబంధిత నేరాలు కూడా పెరుగుతున్నాయని వివరించారు. సైబర్ నేరాల పరంగా జూన్ 2026 నాటికి 711 కేసులు నమోదయ్యాయని, బాధితులు రూ.9.48 కోట్లు కోల్పోయారని, అందులో రూ.1.41 కోట్లు తిరిగి బాధితులకు అందించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 2026లో 1,700 కిలోల గంజాయి, 2025లో సుమారు 4,000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ వివరించారు. రాష్ట్రంలో అత్యధిక గంజాయి స్వాధీనం నమోదవుతున్న కమిషనరేట్లలో ఖమ్మం ఒకటిగా నిలిచిందన్నారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల ధోరణులను, వాటిలో ఉన్న లోపాలను డీజీపీ సమగ్రంగా విశ్లేషించి, దర్యాప్తు నాణ్యత, సత్వర విచారణ, సాంకేతిక వినియో గం, ప్రజల భాగస్వామ్యం పెంపుదల ద్వారా మరింత సమర్థవం తమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

# చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

**- ట్రాఫిక్ అడ్మిన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. లక్ష్మణ్**







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 7 (పీపుల్స్ న్యూస్):** చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ట్రాఫిక్ అడ్మిన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. లక్ష్మణ్ అన్నారు. రోడ్డు భద్రతా చర్యలలో భాగంగా బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థుల కోసం రెండు వేర్వేరు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మొదటి కార్యక్రమాన్ని దోమల్‌గూడలోని ద్వారకా హైస్కూల్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రోడ్డుపై తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల రక్షణను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాధ్యతాయుతమైన ప్రవర్తన ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం అనేది అందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన వివరించారు. దీనితో పాటు విద్యార్థులు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటూ, తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , పెద్దల పట్ల గౌరవాన్ని ప్రదర్శించాలని ఆయన హితవు పలికారు.రెండవ ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని ఆసిఫ్ నగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు , కళాశాల సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, రోడ్డు భద్రతా పద్ధతులు , బాధ్యతాయుతమైన రోడ్డు వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ రెండు అవగాహన కార్యక్రమాల్లో కలిపి మొత్తం 450 మంది విద్యార్థులు , సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ పోచమ్మ చండి హోమం

**-ధర్మకర్తలు ముద్దాపురం మాధవికృష్ణగౌడ్**



**కుత్బుల్లాపూర్ : జూలై 7 (పీపుల్స్ న్యూస్)** షాపూర్ నగర్ శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో ఆలయం ధర్మకర్తలు ముద్దాపురం క్రిష్ణగౌడ్ మాధవిలు మొదటి రోజు వేద పండితులచే ఘనంగా హోమం నిర్వహించడం జరిగింది. జూలై 9న అభిజిత్ ముహూర్తంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు శ్రీ వినాయకుడు, నాగదేవత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు వేద మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం యాగసంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, యోగినీ, వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల పూజలు, దేవతాహ్వానం, మూలమంత్ర అనుష్ఠానాలతో మహోత్సవాలు ప్రారంభించారు.బుధవారం చండీ హోమం, స్వస్తివాచనం, మూలమంత్ర జపం, ఆవాహిత మండప దేవతా పూజలు నిర్వహిస్తారు. జూలై 9న ప్రధాన ఘట్టమైన శ్రీ జీవధ్వజ సహిత రేణుకా ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు శ్రీ వినాయకుడు, నాగదేవత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి.జూలై 10న శ్రీ రేణుకా ఎల్లమ్మ--జమదగ్ని స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం నిర్వహించగా, జూలై 12న అమ్మవారికి సంప్రదాయ బోనాల సమర్పణతో మహోత్సవాలు ముగియనున్నాయి.ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని, తమ వంతు సహకారం అందించి అమ్మవారి దివ్య అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్తలు ముద్దాపురం కృష్ణా గౌడ్, మాధవి కోరారు.

# 'జయలలితకో న్యాయం, జగన్‌కు మరో న్యాయమా

**అమరావతి :** తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయల లితకు ఒక న్యాయం, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ కు మరో న్యాయమా అంటూ ప్రశ్ని ంచా రు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ . ఆదా యానికి మించిన ఆస్తుల కేసుల్లో కేంద్రం, దర్యా ప్తు సంస్థలు ఎందుకు ఉదాసీనంగా వ్యహరి స్తున్నాయని ప్రశ్నించారు. వైఎస్ జగన్ విషయ ంలో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేసుల విషయంలో కోర్టులు చొరవ తీసుకుని విచారణ చేయాలని కోరారు. రాజకీయ ఒత్తిడి కారణమనే అనుమానాలు ప్రజల్లో మొదలయ్యాయని వ్యాఖ్యానించారు. ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి రూ.20 లక్షల పెట్టుబడులు తెచ్చామని గొప్పలు చెప్పుకుంటోందని.. క్షేత్రస్థాయిలో మాత్రం అభివృద్ధి కనిపించడం లేదన్నారు చింతా మోహన్. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పానికి ఏం చేశారో అక్కడి ప్రజలకు చెప్పాలన్నారు.. ఇకనైనా మాటలు కాకుండా పనులు చేయాలని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు అత్యుత్సాహంతో అమాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రశ్న రావణ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొంత విశాల హృదయంతో ఆలోచించాలని.. ఆయన తెలిసో, తెలియకో నోరు జారి ఉంటారన్నారు చింతా మోహన్. ఆంధ్రప్రదేశ్‌లో 2029లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వంటి అంశాలతో ప్రజల్లోకి వెళు తుందన్నారు.అయోధ్య రామమందిరం పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారని.. ఈ అంశంపై సీబీఐతో విచారణ చేయించాలన్నారు మోహన్. అప్పుడు అసలు నిజాలు బయటకు వస్తాయని.. అయోధ్యలో దేవుడి పేరుతో జరిగిన నిధుల దుర్వినియోగంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఇజ్రాయిల్ పర్యటనకు ఎందుకు వెళ్లారు.. అక్కడ ఏ అంశాలపై చర్చించారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభావంతో నిర్ణయాలు తీసుకుంటారని విమర్శించారు. గాజాలో చిన్నపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నా భారత విదేశాంగశాఖ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు చింతా మోహన్.

# వైఎస్ జగన్‌ను కలిసిన ఉపాధ్యాయ సంఘం నేతలు.



**అమరావతి :** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ వైఎస్ జగన్‌ను() ఉపాధ్యాయ సంఘం నేతలు కలిశారు. సర్వీస్‌లో ఉన్న టీచర్స్‌కు టెట్( నిబంధన సరికాదని వివరించారు. బీఈడీ చేసి 25 ఏండ్లే క్రితం ఉద్యోగం సాధించిన తమకు మళ్లీ టెట్ పరీక్ష రాయాలనడం సరైంది కాదన్నారు.ఈ విషయంలో జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వం మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సానకూలంగా స్పందించిన జగన్ సమస్య పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు.

# దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం



**విజయనగరం, జులై 7:** భోగాపురం ఎయిం్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. (మంగళవారం) భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది మెరుగుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎం ఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించా రని అన్నారు. ఆ ఆదేశాలు మేరకు అనుకున్న సమయానికే జీఎంఆర్ సంస్థ ఎయిర్‌పోర్టును నిర్మించిందని చెప్పారు.ఎయిరో డ్రో లైసెన్స్ కూడా వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరుగుతుందన్నా రు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన వారం తర్వాత ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. మోదీ షెడ్యూల్ ఖరారైన తర్వాత తేదీ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భోగాపురానికి తరలిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో 4 కోట్ల మంది ప్రయాణించే విధంగా టెర్మినల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 78,000 చదరపు మీటర్ల మేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు.. దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా ఉందని కితాబిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర కళలు, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేపట్టినట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# 'నేను షాకయ్యా.. ఇది ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదం'



**తూర్పుగోదావరి జిల్లా:** రాజమహేంద్రవరం సమీపంలో స్థానికులు కొంతకాలంగా ఇసుక లారీల కారణంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ ఇసుక లారీ కారణంగా రోడ్లు పాడైపోతున్నాయని, జనాల కళల్లోకి, ముక్కుల్లోకి దుమ్ము వెళుతోంది. ఈ సమస్యపై టీడీపీ మహిళా కార్యకర్త జాహ్నవి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు గత నెలలో ఫిర్యాదు చేశారు. ఈ సమస్య మరింత తీవ్రతరం కావడంతో తాజాగా మరోసారి ట్వీట్ చేసి ట్యాగ్ చేయడంతో మంత్రి లోకేష్ స్పందించారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన సమస్యపై స్పందించారు.. జనాల ప్రాణాలకు, ఆరోగ్యానికి ప్రమాదమని.. సమస్యను పరిష్కరించాలంటూ అధికారుల్ని ఆదేశించారు.ఇదంతా చూసి తాను షాకయ్యానని. ఇది ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదమన్నారు మంత్రి లోకేష్. వెంటనే రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్, గనుల శాఖతో సమన్వయం చేసుకుని.. ఈ రోడ్డును వెంటనే మరమ్మత్తు చేయించాలని సూచించారు. మంత్రి లోకేష్ తమ సమస్యపై స్పందించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో టీడీపీ కార్యకర్త జాహ్నవి ధన్యవాదాలు తెలిపారు.రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరు, మల్లయ్యపేట సమీపంలో రోడ్లు దారుణంగా దెబ్బ తిన్నాయని జాహ్నవి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై స్పందించి పరిష్కరించాలని కోరారు. ప్రతి రోజూ ఇసుక లారీలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండటంతో గుంతలమయంగా మారిందని, దుమ్ముతో నిండిపోతుందన్నారు. ఈ రోడ్డులో ప్రయాణించే స్థానికులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని.. దుమ్ము భరించలేనంతగా పెరిగిపోయిందని, తరచుగా ప్రజల కళ్లలోకి, ముక్కులోకి వెళ్లడంతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయ న్నారు. ఈ సమస్యను విన్నవిస్తూ చాలామంది ఇప్పటికే వీడి యోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి పదే, పదే తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలే దన్నారు.ఎవరైనా ముఖ్యమైన ప్రభుత్వ పెద్దలు ఈ రోడ్డు మార్గంలో వస్తే.. ఆ సమయంలో తాత్కాలికంగా మరమ్మత్తులు చేయిస్తున్నారన్నా రు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనకు వచ్చిన సమయంలో ఈ రోడ్డును తాత్కాలికంగా రిపేర్ చేయించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని. ఈ రోడ్డు సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. రెండేళ్లుగా ఈ సమస్య గురించి చెబుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. అందుకే వెంటనే జోక్యం చేసుకుని ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తే బావుంటుందని కోరారు. గత నెలలో జాహ్నవి ఈ ట్వీట్ చేశారు.తాజాగా మరోసారి ఈ సమస్య గురించి ట్వీట్ చేశారు. ఈ రోడ్డు సమస్య రోజు, రోజుకు తీవ్రమవుతోం దని. తాను ఇటీవల రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే.. ఇది గనులశాఖ పరిధిలోకి వస్తుందని కమిషనర్ తనతో చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. రాజమహేంద్రవరం, కాతేరు ప్రజలు చాలా కాలంగా ఈ సమస్య ఎదుర్కొంటున్నారని.. దుమ్ము, దెబ్బతిన్న రోడ్లు, ఇసుక లారీల రాకపోకల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరోసారి సమస్యను వివరించారు. అలాగే ఆరోగ్యపరమైన సమస్యలతో పాటుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మరోసారి కోరారు. జాహ్నవి ట్వీట్‌పై స్పందించిన మంత్రి లోకేష్ సమస్యను పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు.

# సనాతన ధర్మాన్ని కించపరిచేలా ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు



**విశాఖపట్నం, జులై 7:** మతాల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ చూస్తోందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. (మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. ప్రశ్న రావణ్, జడ శ్రవణ్ కుమార్, ప్రకాశ్ రాజ్.. ప్రతిరోజూ హిందువులపై విషాన్ని చిమ్ముతున్నారని మండిపడ్డారు. హిందూ వ్యతిరేకంగా ఉన్నవారందరికీ వైసీపీ న్యాయ సహాయం చేస్తోందన్నారు. హిందువుల పేర్లు పెట్టుకుని సనాతన ధర్మాన్ని కించపరిచేలా నటుడు ప్రకాశ్ రాజ్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.హిందువుల ఆరాధ్య దైవాలను కించపరిచే హక్కు ఎవరిచ్చారని స్వామీజీ ప్రశ్నించారు. ప్రభుత్వం.. తప్పులు చేస్తున్న వారిని చట్టప్రకారం అరెస్టు చేస్తుంటే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన తప్పులను ఎత్తి చూపినందుకే తమను టార్గెట్ చేశారన్నారు. హిందూ మనోభావాలను దెబ్బతీస్తూ చేస్తున్న వ్యాఖ్యల వెనుక వైసీపీ కుట్ర ఉందని స్వామి శ్రీనివాసానంద ఆరోపించారు.తమిళనాడు సీఎంపై ప్రశంసలుతమిళనాడు సీఎం విజయ్‌పై స్వామి శ్రీనివాసానంద సరస్వతి ప్రశంసలు కురిపించారు. హిందూ ఆలయాల నుంచి వచ్చే నిధులను ఆలయాల అభివృద్ధి కోసమే వాడుతామని తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. విజయ్ నిర్ణయాన్ని తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. హిందూ ఆలయాల నిధులను ఇతర అవసరాల కోసం మళ్లించకూడదని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సీఎంలు కూడా తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయమే తీసుకోవాలని స్వామీజీ కోరారు.ఆ ముసుగులో హిందుత్వంపై దాడులు: శ్రీరామ్నాన్ ప్రకారమే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై దాడులు చేస్తున్నారని హిందూ సంఘాల నేత తురగా శ్రీరామ్ అన్నారు. ఏపీలో రిజర్వేషన్ల జిహాద్ జరుగుతోందని ఆరోపించారు. రిజర్వేషన్లను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్లు లాక్కునేవారి వెనుక నాయకులు ఉన్నారని వ్యాఖ్యానించారు. కొంతమంది యూట్యూబర్, జర్నలిస్టుల ముసుగులో హిందుత్వంపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్న రావణ్‌కు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మద్దతు ఇస్తున్నారంటే అర్థం ఏంటి అని శ్రీరామ్ ప్రశ్నించారు.

# దేశాన్ని, హిందూమతాన్ని అవమానించిన వారిని జగన్ వెనకేసుకొస్తున్నారు.



**రాజమండ్రి, జులై 7 ():** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైమంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని, హిందూమతాన్ని అవమానించిన వారిని జగన్ వెనకేసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం రంపచోడవరం మండలం పందిరి మామిడిలో నీరా ప్లాంటేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. జగన్ హయాంలో బీసీలకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించారని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో 1,608 మంది బీసీలు పదవులు కోల్పోయారని తెలిపారు.వైసీపీ నేతలు బీసీ రౌండ్‌టేబుల్ పేరుతో కుట్రలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. ఏపీకి పెట్టుబడులు రావడం జగన్‌కు ఇష్టం లేదని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల లిక్కర్ స్కాం దేశంలోనే పెద్దదని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. పనికిరాని బ్రాండ్లతో వేలకోట్లు దోచుకున్నారని ఫైర్ అయ్యారు. నాసిరకం మద్యంతో వేలమందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీని అడ్రస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. కేరళ, గోవా తరహాలో రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.ధరల అమ్మకాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మితే మద్యం షాపులు సీజ్ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## అక్రమాలు కూల్చడం కుదరట్లే..

# జేసీబీ దొరకట్లే..?


### ఆర్ఐ చెపుతున్న సాకులు..?
### నాడు అక్రమాలు నేలమట్టం.. నేడు సెటిల్మెంట్..?

**కూకట్ పల్లి : జూలై 7 (పీపుల్స్ న్యూస్)** ప్రభుత్వ భూమిపై గద్దల్లా వాలిపోతున్న అక్రమార్కులకు, అమ్యామ్యాలకు అలవాటు పడిన స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ సపోర్ట్ గా నిలుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక కూకట్ పల్లి మండల పరిధిలోని, సర్వే నంబరు 336లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్న విషయాన్ని అధికారులకు "పీపుల్స్ న్యూస్" దినపత్రిక ద్వారా తెలియచేసినప్పటికి స్థానిక ఆర్ఐ కిందిస్థాయి వారిని పంపి తూతూమంత్రంగా నామమాత్రపు చర్యలు తీసుకోవడం విడ్డూరం. పలు దినపత్రికలో కథనాలు వచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈపై వార్త కథనంపై వివరణ కోరగా, స్థానిక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు కూల్చడానికి జేసీబీ దొరకడం లేదు అని స్థానిక రెవిన్యూ అధికారి ఓ సాకు చెప్పడం అస్యదాస్పదం. గతంలో ఇటీవలే భూమి ఆక్రమణ జరిగిందని ఫిర్యాదుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మార్వో తానే స్వయంగా చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేసి, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ సదరు కబ్జాదారులు ససేమిరా అంటూ మమ్మల్ని చేసేదేమీ లేదు అని, అదే స్థలంలో తిరిగి మళ్ళీ నిర్మాణాలు చేపట్టి వారం రోజులు గడుస్తున్నా, స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టించుకోక, పైగా స్థానిక రెవిన్యూ అధికారి, అన్నీ తానే వుండి అక్రమార్కులకు సహకరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంధునిమిత్తమే ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోలేక పోతున్నారని, త్వరగా న్యాయస్థానం నుండీ స్టే తీసుకోండి అని ఉచిత సలహాలు సూచనలు చేస్తున్నారనే గుసగుసలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి, గతంలో కూల్చివేసిన స్థలంలోనే తిరిగి అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న స్థానిక అధికారులపై మరియు కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కబ్జాదారుల నుండీ ప్రభుత్వ భూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.






## ఎన్డీయేలోకి శరద్‌పవార్ ఎన్సీపీ.. మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు షాక్ తప్పదా



**మహారాష్ట్ర:** రాజకీయాల్లో మరో సంచలనం జరగబోతుందా..? ఇప్పటివరకు ప్రతిపక్ష కూటమిలో ఉన్న శరద్ పవార్ ఎన్సీపీ (ఎస్పీ).. ఇప్పుడు ఎన్డీయేలో చేరే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలి కాలంలో శరద్ పవార్ ఎన్సీపీ సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. ఈ నేపథ్యంలో తన పార్టీని బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయేలో కలపాలని శరద్ పవార్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం మహారాష్ట్రలో బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి కూటమి అధికారంలో ఉంది. ఇందులో బీజేపీతోపాటు షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ భాగస్వాములుగా ఉన్నాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీయే)లో కాంగ్రెస్, ఉద్ధవ్ వర్గం శివసేన, శరద్ పవార్ వర్గం ఎన్సీపీ సభ్యులుగా ఉన్నాయి.అయితే, వరుస ఓటములు, మరోవైపు ఎంవీయేకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీలోని ఎన్డీయేవైపు, మహాయుతి కూటమివైపు చూస్తున్నారు. ఉద్ధవ్ శివసేనకు సంబంధించి మీటింగ్‌కు ఆ పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. ఆ పార్టీ ఎంపీలు షిండే వర్గంలో చేరారు. ఇదే పరిస్తితి శరద్ పవార్ ఎన్సీపీలో కూడా కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తన పార్టీ మనుగడ కష్టమని భావించిన శరద్ పవార్.. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసేందుకు ప్రయత్నించారు. కానీ, కాంగ్రెస్ పార్టీలోని నేతల నుంచి సరైన మద్దతు లభించలేదు. దీంతో ఆయన ఇప్పుడు ఎన్డీయేలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్న చర్చ జరుగుతోంది. 2024 ఎన్నికల సమయంలోనే తన పార్టీని కాంగ్రెస్‌లో కలపాలని శరద్ పవార్ భావించారు. ఈ విషయంపై కాంగ్రెస్ పెద్దలతో చర్చించారు. అయితే, ఎన్నికల తర్వాత దీనిగురించి చర్చిద్దాం అని అప్పట్లో వాయిదావేశారు. తర్వాత మరోసారి శరద్ పవార్.. కాంగ్రెస్ పెద్దలతో విలీన ప్రతిపాదన తెచ్చారు. వారు మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలతో చర్చించారు. కానీ, వారు ఎన్సీపీ తమ పార్టీలో చేరడాన్ని వ్యతిరేకించారు. ఎన్సీపీ తమ పార్టీలో విలీనమైతే తమకు ప్రాధాన్యం తగ్గుతుందని భావించారు. ప్రతిపాదన ముందుకు కదల్లేదు..

## దేశవ్యాప్తంగా 58 ఇంజనీరింగ్ కాలేజీల మూసివేత.



**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా గత ఏడాది 58 ఇంజనీరింగ్ కాలేజీలను యాజ మాన్యాలు మూసేశాయి. దీనికి సంబంధించి ఆయా కాలేజీలకు ప్రభుత్వం కూడా అనుమతిం చింది. ఈ విషయాన్ని ఏఐసీటీఈ (ది ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) తాజాగా వెల్లడించింది. ఏఐసీటీఈ అనుమతితో 2025-26లో దేశవ్యాప్తంగా 58 ఇంజనీరింగ్ కాలేజీలు మూసివేశారు. ఈ 58 కాలేజీల్లో మూడు ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలుకాగా, మిగతావి ప్రైవేటు కాలేజీలు. కాలేజీల మూసివేతకు యాజమాన్యాలు చేసుకున్న దరఖాస్తులతో ఈ అనుమతి లభించింది. దీని ప్రకారం ఈ 58 కాలేజీలు 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఫస్ట్ ఇయర్‌లో కొత్త అడ్మిషన్లు తీసుకోలేదు.కానీ, అప్పటికే కొనసాగుతున్న విద్యార్థులకు సంబంధించి వారి అకమిక్ కోర్సులు పూర్తయ్యే వరకు కాలేజీలు కొనసాగుతాయి. అంటే, సెకండియర్, థర్డ్ లేదా ఫైనలియర్ చదువుతున్న విద్యార్థుల పూర్తి కోర్సు పూర్తయ్యే వరకు కాలేజీలు పని చేస్తాయి. ఈ విషయంలో విద్యార్థుల భద్రతకు, భవిష్యత్తుకు ఆయా కాలేజీలు గ్యారెంటీ ఇవ్వాల్సిందే. అవసరమైతే విద్యార్థుల్ని మరో కాలేజీకి బదిలీ చేస్తారు. ఈ విషయంలో ఏఐసీటీఈ వారికి అండగా ఉంటుంది. ఆయా కాలేజీల్లో కోర్సులు పూర్తయ్యేలా చూస్తుంది. కొంతకాలంగా కాలేజీల్లో సరైన అడ్మిషన్లు లేకపోవడం, అలాగే, ప్రస్తుతం అకడమిక్ ప్రమాణాలు, మౌలిక వసతుల ప్రమాణాలకు అనుగుణంగా కాలేజీలు నిర్వహించలేనందున వాటిని మూసేస్తున్నట్లు ఆయా కాలేజీల యాజమాన్యాలు తమ అభ్యర్థనల్లో పేర్కొన్నాయి. ఈ ప్రక్రియను ఏఐసీటీఈ.. ప్రగతిశీల మూసివేతగా పేర్కొంది. మరోవైపు 2025-26 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 950కిపైగా టెక్నికల్, ఇంజనీరింగ్ కోర్సులు రద్దయ్యాయి.

## మోదీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం- బ్రహ్మోస్‌తో సహా 20 కీలక ఒప్పందాలు ఖరారు

**న్యూ ఢిల్లీ :** భారత్, ఇండోనేషియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో మధ్య జకార్తాలో జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇండోనేషియా సైన్యానికి భారత్ అత్యాధునిక బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను సరఫరా చేయడంతో పాటు సముద్ర భద్రత, కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థ, రక్షణ రంగ సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ అరుదైన గౌరవం లభించింది. ప్రధానికి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రదానం చేశారు.20 ఒప్పందాలపై సంతకాలుసమావేశం అనంతరం ఇరు దేశాలు దాదాపు 20 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. కీలక ఖనిజాలు, సాంకేతికత, ఆహార భద్రత, ఔషధ రంగం, సముద్ర భద్రత, వాణిజ్యం, పారిశ్రామిక సహకారం వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఈ ఒప్పందాలు దోహదం చేయనున్నాయి. ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగానికి అవసరమైన ఉక్కు, నికెల్, అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో ఇండోనేషియా కీలక దేశంగా ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ ఉక్కు, నికెల్, రేర్ ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ రంగాల్లో భారత్ పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. దీనివల్ల భారత పరిశ్రమలకు అవసరమైన కీలక ఖనిజాల సరఫరా మరింత బలపడనుంది.బ్రహ్మోస్, అస్త్ర క్షిపణులపై సహకారంభారత్ తయారు చేసిన బ్రహ్మోస్ క్షిపణులను ఇండోనేషియాకు సరఫరా చేయాలని నిర్ణయించారు. అలాగే 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా భారత్ అభివృద్ధి చేసిన 'అస్త్ర' గగనతల క్షిపణుల పనితీరుతో ఆకర్షితమైన ఇండోనేషియా వాటిని కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం కొత్త దశలోకి అడుగుపెట్టనుంది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సబాంగ్ పోర్టును సంయుక్తంగా అభివృద్ధి చేయాలని భారత్, ఇండోనేషియా నిర్ణయించాయి. మలక్కా జలసంధిని ఆనుకుని ఉన్న ఈ పోర్టు, భారత్ గ్రేట్ నికోబార్ పోర్టు ప్రాజెక్టుకు సుమారు 100 మైళ్ల దూరంలో ఉండటంతో వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, వాణిజ్య రవాణా బలోపేతానికి ఇది ఉపయోగపడనుంది. ఇండోనేషియా చెల్లింపుల వ్యవస్థతో భారత యూపీఐని అనుసంధానించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. దీని వల్ల వ్యాపార లావాదేవీలు, పర్యాటకుల చెల్లింపులు మరింత సులభతరం కానున్నాయి. అలాగే ఇండోనేషియాలో భారతీయ నిర్వహణ విద్యాసంస్థ ఐఐఎం-బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ సమావేశంలో పశ్చిమాసియా పరిస్థితులతో పాటు పలు అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరు నేతలు చర్చించారు. ప్రపంచంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో సంభాషణ, దౌత్యానికి మరింత ప్రాధాన్యం పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాలస్తీనా సమస్యకు రెండు దేశాల పరిష్కారానికే భారత్ మద్దతు కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేశారు.'స్వర్ణయుగానికి నాంది'ఇటీవలి కాలంలో భారత్, ఇండోనేషియా మధ్య పరస్పర విశ్వాసం పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దీంతో రక్షణ, భద్రత, సముద్ర సహకారం మరింత బలపడుతోందని చెప్పారు. రక్షణ రంగ పరస్పర మార్పిడి, విపత్తు నిర్వహణ, పారిశ్రామిక సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు వెల్లడించారు. 2018లో ఏర్పడిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం నేడు కొత్త శిఖరాలకు చేరుకుందని అన్నారు. అభివృద్ధి, భద్రత, సాంకేతికత, విద్య, సంస్కృతి తదితర అన్ని రంగాల్లో కొత్త అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. భారత్-ఇండోనేషియా సంబంధాల్లో నేటి నుంచే స్వర్ణయుగానికి నాంది పలుకుతున్నామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే బ్లూ ఎకానమీ, సముద్ర వాణిజ్యం, పోర్టుల అభివృద్ధి రంగాల్లో కూడా కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్ణ' (స్టార్ ఆఫ్ ఇండోనేషియా)ను ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రదానం చేశారు. పురస్కారం స్వీకరించిన అనంతరం మోదీ ఈ గౌరవాన్ని దేశ ప్రజలకు అంకితం చేశారు. ఇండోనేషియా అత్యున్నత పురస్కారాన్ని ఎంతో ఆప్యాయత, గౌరవంతో అందుకున్నానని అన్నారు. ఇది ఇండోనేషియా ప్రజల ప్రేమాభిమానాలకు, మన రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక బంధానికి ప్రతీక అని తెలిపారు. ఈ గౌరవం అందించిన అధ్యక్షుడు ప్రబోవో, ఇండోనేషియా ప్రభుత్వం, అక్కడి ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.చర్చలకు ముందు ప్రధాని మోదీకి జకార్తాలో మంగళవారం అద్భుత స్వాగతం లభించింది. గుర్రాలపై భద్రతా దళాల ఎస్కార్ట్, గౌరవ వందనం, సాంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ప్రధాని మోదీకి ఇండోనేషియా ప్రభుత్వం ఘనంగా ఆహ్వానం పలికింది. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా మోదీకి స్వాగతం పలికి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య ద్వైపాక్షిక చర్చలు ప్రారంభమయ్యాయి.




## సీఎం విజయ్‌కి మద్రాసు హైకోర్టు నోటీసులు



**చెన్నై:** మిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ఎన్నికల విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. క్రీడా శాఖ మంత్రి ఆదవ్ అర్జున సాధించిన విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా జస్టిస్ వీ లక్ష్మీనారాయణన్ ఏకసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని హైకోర్టు పిటిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సాంకేతిక ప్రక్రియ పూర్తయిన తర్వాత సీఎం విజయ్, మంత్రి ఆదవ్ అర్జునకు 3 వారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనున్నారు.ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా.. ఆరు నెలలలోపే పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. కాగా, నామినేషన్ అఫిడవిట్‌లో పెండింగ్ కేసుల వివరాలు దాచారని, ఎన్నికల ఖర్చులను పూర్తిగా చూపలేదని విజయ్‌పై డీఎంకే అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో చట్ట విరుద్ధంగా చిన్నపిల్లలను ఉపయోగించుకున్నారంటూ ఇనిగో తన పిటిషన్‌లో ప్రస్తావించారు. విజయ్ విజయాన్ని రద్దు చేసి తనను విజేతగా ప్రకటించాలని, అలాగే తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గ ఉపఎన్నికపై స్టే విధించాలని డీఎంకే అభ్యర్థి ఇనిగో కోరారు.

## ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు తప్పిన ప్రమాదం




**సిరియా :** సిరియా పర్యటన లో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కు పెను ప్రమాదం తప్పింది. రాజధాని డమస్కస్‌లో ఆయన బసచేసిన హోటల్ సమీపంలో మంగళవారం వరుస పేలుళ్లు సంభవించాయి. అయితే ఈ ఘటనలో మాక్రాన్ సురక్షితంగా ఉన్నారని, పేలుళ్ల తర్వాత కూడా ఆయన తన పర్యటనను యథావిధిగా కొనసాగించారని ఫ్రాన్స్ అధ్యక్ష భవనం ప్రకటించింది.రాయిటర్స్ కథనం ప్రకారం.. డమస్కస్‌లోని మాక్రాన్ బస చేసిన హోటల్‌కు సమీపంలో ఈ బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనను సిరియా భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. పేలుళ్ల అనంతరం అధికారులు వెంటనే అప్రమత్తమై ఆ ప్రాంతానికి వెళ్లే రహదారులను మూసివేసి భద్రతను కట్టుదిట్టంచేశారు. సంఘటనా స్థలం నుంచి పొగలు వస్తున్నట్లు రాయిటర్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు. పేలుళ్లు జరిగిన సమయంలో మాక్రాన్ తన కాన్వాయ్‌లో వేరే కార్యక్రమానికి వెళుతున్నారని, ఆయనకు పేలుళ్ల శబ్దం కూడా వినిపించలేదని ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం స్పష్టంచేసింది.మాక్రాన్‌తో పాటు ఉన్న రాయిటర్స్ జర్నలిస్ట్ కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు. ఈ ఘటన జరిగినప్పటికీ మాక్రాన్ ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో అధ్యక్ష భవనంలో సమావేశమయ్యారు. 2024లో బషర్ అల్-అస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత, ఒక యూరోపియన్ యూనియన్ దేశాధినేత సిరియాలో పర్యటించడం ఇదే తొలిసారి.

# సంపాదకీయం



# జనాభా పెరిగితే తట్టుకోగలమా ?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండిపెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.



# అయోధ్య చోరీలో కీలక ఆధారాలు సేకరణ

**● కరెన్సీని జేబులు, బూట్లల్లో దాచుకుని తరలింపు 70సార్లు ● దొంగతనం..చూసీచూడనట్లుగా అధికారులు ● సిసి టివి ఫుటేజ్ ఆధారాలను సుకరించిన సిట్**

**అయోధ్య,జూలై7:** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక ఆధారాలను సేకరించినట్లు సిట్ వెల్లడించింది. ఈ విషయంపై యూపీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వర కు విరాళాల లెక్కింపు చేపట్టిన వ్యక్తుల్లో కొందరు డబ్బు లు అపహరించినట్లు సీసీటీవీ దృశ్యాల్లో తేలిందని పేర్కొంది. ఈ 39 రోజుల్లో లెక్కించే సమయంలో కొంతమంది సిబ్బంది కరెన్సీ నోట్ల కట్టలను, చిల్లరను తమ దుస్తులు, జేబులు, బూట్లలో దాచిపెట్టినట్లు సీసీటీవీ రికార్డుల్లో కనిపించిందని తెలిపింది. డబ్బును సిబ్బంది దొంగలిస్తున్నట్లు చూసిన కొందరు అధికారులు కూడా వారిని ఆపడానికి ప్రయత్నించలేదని సిట్ పేర్కొంది. నిందితులు దాదాపు 70 సార్లు దొంగతనాలకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, లెక్కింపు సిబ్బందిని విచారించామన్నారు. వారి వాంగ్మూలాల ప్రకారం ఏప్రిల్ 27కి ముందు కూడా విరాళాల చోరీ జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంలో ఆధారాలు సేకరించడం సవాలుగా మారి ందన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ఐదేళ్ల ఖాతాలను రీఆడిట్ చేస్తున్నామని.. బ్యాంకు రికార్డులు, విరాళాల పత్రాలు, ఆలయ నిర్మాణ వ్యయాలు, బంగారం, వెండి వస్తువులతో సహా అన్ని ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆలయంలో భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ పరికరాలపై పరిమితులు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి చర్యల్లో అనేక లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లోపాలను వినియోగి ంచుకుని నిందితులు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. విలువైన కానుకల నిర్వహణ, డాక్యుమెంటేషన్, తూకం వేయడం వంటి వాటిల్లోనూ పలు విధానపరమైన లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెళిష్ పాండే, రామశంకర్ మిశ్రాలకు ప్రమేయం ఉన్నట్లు నిర్ధరిం చారు. సీసీటీవీ దృశ్యాల్లో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్‌లు పలుమార్లు నగదు, నగలను అపహరిస్తున్నట్లు రికార్డ్ అయ్యిందని పేర్కొన్నారు.

# ప్రశ్నపై 'ఉపా' ఉచ్చు




పాలకుల తప్పులను ఎండగట్టడం, ప్రజల పక్షాన నిలబడి నిలదీయడం జర్నలిజం ప్రాథమిక ధర్మం. కానీ నేడు ఆ ధర్మాన్ని నిర్వర్తించడమే అతిపెద్ద నేరంగా మారిపోయింది. స్వతంత్రంగా వ్యవహరిస్తూ, పాలకులకు నచ్చని నిజాలను రాసే జర్నలిస్టులను టార్గెట్ చేస్తూ ప్రభుత్వాలు సాగిస్తున్న నిర్బంధకాండ ప్రజాస్వామ్య వ్యవస్థలనే ప్రమాదంలోకి నెడుతోంది. ఇటీవలి కాలంలో దేశంలో జర్నలిస్టులపై, సామాజిక కార్యకర్తలపై యథేచ్ఛగా 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ఈ ధోరణికి పరాకాష్ట. విమర్శిస్తే చాలు... అక్రమ కేసులు, అర్ధరాత్రి అరెస్టులు, నిరంతర వేధింపులతో జర్నలిస్టులను లొంగదీసుకునే ప్రయత్నాలు కోకొల్లలు. దీనివెనుక స్పష్టమైన రాజకీయ కోణం దాగుంది. ప్రశ్నకోసమే పార్టీ పెడుతున్న అన్న ఏపీ ఉపముఖ్యమంత్రి ఆ ప్రశ్ననే తట్టుకోలేకపోతే ఎలా? మొన్నటికి మొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, ఇప్పుడూ తెలంగాణకు చెందిన జర్నలిస్టులు, కేవీఆర్, ప్రశ్న రావణ్ వంటి వారిపై ఏపీలో 'ఉపా' కేసులు బనాయించడం ఈ అణచివేత ధోరణికి ప్రత్యక్ష ఉదాహరణలు. ఇది కేవలం ఒక వ్యక్తిని జైల్లో పెట్టడం మాత్రమే కాదు, ప్రశ్నించే ప్రతి గొంతుకను భయభ్రాంతులకు గురిచేసే ఒక వ్యవస్థీకృత కుట్ర. ఏపీలో సాయికృష్ణ హత్య, క్రాంతికుమార్ ఆత్మహత్య, ఆడపిల్లలపై లైంగికదాడుల వంటి అనేక ఘటనలు జరుగుతుంటే వాటిపై చర్యలకు ఉపక్రమించకుండా... గతంలో ఎన్నడూ లేని విధంగా, కేవలం వార్తలు రాసి నందుకు, సోషల్ మీడియాలో అభిప్రాయాలు పంచుకున్నందుకు జర్నలిస్టులపై దేశద్రోహం వంటి అత్యంత కఠినమైన చట్టాలను ప్రయోగించడం నిత్యకృత్యమైపోయింది. అదే సందర్భంలో రావణ్ విమర్శను తప్పుపట్టిన పవన్ కళ్యాణ్, కేసుపెట్టిన రాధామనోహర్‌లు వాడిన భాష సంగతేంటి? ఒక్కరిని కఠినంగా శిక్షిస్తే, మిగతా వంద మంది భయపడి పాలకుల తప్పులను రాయడం మానేస్తారనేది ప్రభుత్వాల దుష్ట ఆలోచన. అందుకే, పెద్ద మీడియా సంస్థలు చాలావరకు పాలకుల భజన బృందాలలో చేరిపోయాయి. క్షేత్రస్థాయిలో నిజాయితీగా పనిచేసే స్వతంత్ర జర్నలిస్టులు, యూట్యూబ్ జర్నలిస్టులు, చిన్న పత్రికల ప్రతినిధులు తీవ్రమైన అణచివేతకు గురవుతున్నారు. కార్మిక, శ్రామిక వర్గాల సమస్యలను, రైతుల, గ్రామీణ ప్రజల ఆవేదనను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులను ఉగ్రవాదులుగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తులుగా చిత్రీకరించడం పాలకుల ఫాసిస్టు ధోరణికి అద్దం పడుతోంది. నిజాలు మాట్లాడే నోళ్లను నొక్కేయడం ద్వారా తాము చేసే ప్రతి అక్రమాన్ని చట్టబద్ధం చేసుకోవచ్చని పాలకులు భావిస్తున్నారు. అయితే, చరిత్రలో ఏ శక్తీ నిర్బంధం ద్వారా సత్యాన్ని శాశ్వతంగా దాచలేకపోయింది. స్వేచ్ఛ అనేది అపరిమిత హక్కు కాదు. అదే సమయంలో చట్టాల పేరుతో ప్రజాస్వామ్య విమర్శలను అణచివేయడం కూడా సమర్థనీయం కాదు. అసత్య ప్రచారాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొనే మార్గాలు అనేకం. వాస్తవాలను ప్రశ్నించే స్వరాలను కూడా అదే గాటన కట్టేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బ తింటుంది. ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ ప్రత్యర్థిగా చూడడం, ప్రతి విమర్శను కుట్రగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య సంస్కృతిని బలహీనపరుస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్న శత్రువు కాదు, అదొక అద్దం. అందులో కనిపించే లోపాలను సరిదిద్దు కోవడం పాలకుల పరిణతి. అలా కాకుండా ఆ అద్దాన్నే పగలగొట్టాలని ప్రయత్నించడం బలానికి కాదు, అసహనానికి సంకేతం. ప్రస్తుతం దేశంలో జరుగుతోందిదే.న్నటికి నిన్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు తెలపడం లేదా ధర్నాలు చేయడం అనేది పౌరుల ప్రాథమిక హక్కు అని ముంబై హైకోర్టు స్పష్టం చేసింది. అంతకు ముందు ఢిల్లీలో సీఏఏ వ్యతిరేక ఆందోళన వార్తలను, రైతుల ఉద్యమం విశేషాలను 'న్యూస్‌క్లిక్' నిరంతరంగా ప్రచురించింది. అధికార శ్రేణులకు మింగుడుపడని మరెన్నో అంశాల్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారపార్టీ ప్రబీర్ పురకాయస్థపై కక్ష కట్టింది. ఢిల్లీ ప్రత్యేక పోలీసు విభాగాన్ని సోదాలకు పంపింది. ఆయనపై 'ఉపా' కేసు పెట్టింది. ఆధారాలు చూపడంలో విఫలమయ్యారంటూ పోలీసులకు సర్వోన్నత న్యాయస్థానం తలంటు పోసింది. అరెస్టు చెల్లదని స్పష్టమైన తీర్పునిచ్చింది. ఢిల్లీకి చెందిన విద్యార్థి నాయకుడు, సామాజిక కార్యకర్త ఉమర్ ఖలీద్‌పై ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ పేరుతో ఆరేండ్లుగా జైల్లో ఉంచడం దేశ వ్యాప్తంగా ఇప్పటికీ చర్చనీయాంశమే. నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా, కేవలం భిన్నాభిప్రాయాలను వ్యక్త పరిచినందుకు ఇలాంటి క్రూరమైన చట్టాలను ప్రయోగించడం పౌర హక్కుల హరణమే అవుతుంది. ఇక్కడ శిక్ష కంటే విచారణే ఒక పెద్ద శిక్షగా మారుతున్న దుస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే జర్నలిస్టులపై దజన్ల కొద్దీ కేసులను ఉదహరించవచ్చు. అసలు అభియోగాలే లేకుండా ఇప్పటికీ ఎందరో జైళ్లలో మగ్గుతున్నారు. ప్రజాపక్షం వహించే జర్నలిజాన్ని నియంత్రించడానికే ప్రభుత్వాలు ఈ చట్టాలను ఉపయోగిస్తున్నాయని ఇది స్పష్టంగా సూచిస్తోంది. ఈ నేపథ్యంలో పత్రికా స్వేచ్ఛ కోసం, నిజమైన జర్నలిజం కోసం పాత్రికేయ సమాజం మాత్రమే కాదు, పౌరసమా జమూ సమాయత్తం కావాలి. లేకపోతే ప్రజాస్వామ్య సౌధమైన నాలుగోస్తంభం కూలిపోతుంది.

# నెలాఖరులో వర్షాకాల శాసనసభ సమావేశాలు

**సన్నాహాల్లో అధికారులు**

**పలు అసెంబ్లీ కమిటీల నియామకం**


**సెలెక్ట్ కమిటీ చైర్మెన్‌గా మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వీటి నిర్వహణకు సర్కారు సన్నద్ధమవుతున్నది. ఈనెలాఖరులో గానీ, ఆగస్టు తొలి వారంలో గానీ ఈ సమావేశాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శాసన మండలి, శాసనసభ భవనాలకు సంబంధించి కొన్ని మరమ్మతులు, మరికొన్ని సుందరీకరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టుగా అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను నిర్మించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదిలావుండగా అసెంబ్లీ భవనం సొంతం పునరుద్ధరిస్తున్నారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి సైతం ఈ విషయమై సమాలోచనలు చేస్తున్నారు. సమావేశాలు చేపడితే ఎప్పటి నుంచి, ఎన్నిరోజులు అనే విషయపై ఇంకా స్పష్టత లేదు. సమావేశాలు ప్రారంభమైన తర్వాత బీఏసీ భేటీలోనే ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలనే సంగతిపై స్పష్టత రానుంది. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో మీడియా సలహామండలి కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే కొత్త విప్‌లు వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌కు అసెంబ్లీ ప్రాంగణంలో కొత్తగా చాంబర్లను కేటాయించారు. వారు ఇక నుంచి ఆయా కార్యాలయాల నుంచి పని చేస్తారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు కేవలం వారం రోజులు మాత్రమే నిర్వహించేందుకు చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఇదిలావుండగా ప్రతియేటా నియమించే అసెంబ్లీ కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ నర్సింహ్మాచార్యులు ఆదేశాలు జారీ చేశారు. సెలెక్ట్ కమిటీ చైర్మెన్‌గా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నియమితులయ్యారు. ?ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మికాంతరావు, జి మధుసూదన్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మామిడాల యశస్వీని, దానం నాగేందర్, కోవా లక్ష్మి, కె.మాణిక్‌రావు, శ్రీరామ్ రావు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని సాంబశివరావు ఉన్నారు. సబార్డినేట్ లేజిస్లేషన్ కమిటీ చైర్మెన్‌గా కడియం శ్రీహరితోపాటు మరో 10 మంది సభ్యులను నియమించారు. అలాగే సదుపాయాల కమిటీ చైర్మెన్ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తోపాటు మరో 10 మంది ఎమ్మెల్యేలను నియామకం చేశారు. ఎస్సీల సంక్ష?మ కమిటీ చైర్మెన్‌గా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎస్టీ సంక్ష?మ కమిటీ చైర్మెన్‌గా పాయం వెంకటేశ్వర్లు, బీసీ సంక్ష?మ కమిటీ చైర్మెన్‌గా మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, గ్రంథాలయ కమిటీ చైర్మెన్‌గా మట్టా రాగమయి, మహిళా, శిశు, వికలాంగుల కమిటీ చైర్మెన్‌గా చిట్టెం పర్నికారెడ్డి, మైనార్టీల సంక్ష?మ కమిటీ చైర్మెన్ లక్ష్మి కాంతరావు, వైల్డ్‌లైఫ్, పర్యావరణ కమిటీ చైర్మెన్‌గా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వ్యవహరించనున్నారు. కాగా పిటిషన్ల కమిటీ, ప్రివిలేజేస్ కమిటీ చైర్మెన్‌గా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ హామీల కమిటీ చైర్మెన్‌గా పట్లోళ్ల సంజీవరెడ్డి, రూల్స్ కమిటీ చైర్మెన్‌గా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎథిక్స్ కమిటీ చైర్మెన్‌గా రేవూరి ప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ కమిటీల పదవీకాలం ఏడాది ఉంటుంది. లేదా కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాతవే పనిచేస్తాయని అసెంబ్లీ వ్యవహారాలు చూసే అధికారులు చెప్పారు. **రాజ్యసభ ఎథిక్స్ కమిటీ రాక** రాజ్యసభ ఎథిక్స్ కమిటీ చైర్మెన్, ఇద్దరు సభ్యులు సోమవారం తెలంగాణ అసెంబ్లీని సందర్శించారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల మంత్రి డి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వీరి మధ్య సమావేశం జరిగింది.

బుధవారం,
జూలై 08, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# గురుపూజ ఎందుకు చేయాలి గురువు విశిష్టత, ఆరాధన వల్ల కలిగే అద్భుత ఫలితాలు!




జీవితంలో ఎవరికైనా గురువు అవసరం. అది విద్యార్థులకైనా, ఆధ్యాత్మిక సాధకులకైనా సరే! అందుకే మన సనాతన ధర్మం 'ఆచార్య దేవోభవ!' అంటూ తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుకే ఇచ్చింది. 'గురు బ్రహ్మ గురు విష్ణు గురుర్దేవో మహేశ్వరః' అంటూ త్రిమూర్తుల అంశయే గురువు అని నొక్కి వక్కాణించింది. వారంలో మిగిలిన ఆరు రోజుల ఎలా ఉన్నా గురువారం మాత్రం గురువును తప్పకుండా ఆరాధించాలని శాస్త్రం చెబుతోంది. ఈ కథనంలో అసలు గురువును ఎందుకు ఆరాధించాలి? గురువు ఆరాధనకు ఎందుక ంతటి విశిష్టత అనే విషయాలు తెలుసుకు ందాం.అజ్ఞాన తిమిరాన్ని తొలగించే వెలుగు గురువుభారతీయ సంస్కృతిలో 'గురువు' అనే పదానికి దైవంతో సమానమైన స్థానం ఉంది. జ్ఞానాన్ని ప్రసాదించి, అజ్ఞానమనే చీకటిని తొలగించి, జీవితానికి సరైన మార్గదర్శనం చేసేవారే గురువు. సంస్కృతంలో 'గు' అంటే అజ్ఞానం లేదా చీకటి, 'రు' అంటే దానిని తొలగించేవాడు అని అర్థం. శిష్యునిలోని అజ్ఞానాన్ని పోగొట్టేవాడే గురువు.త్రిమూర్తి స్వరూపం"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః" అనే శ్లోకం ప్రకారం, గురువు బ్రహ్మలా జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు విష్ణువులా రక్షిస్తాడు మహేశ్వరునిలా మనలోని అజ్ఞానాన్ని లయం చేస్తాడు.ప్రత్యక్ష దైవం

సామాన్య మానవులకు దైవం కనిపించడు. దైవ దర్శనం కావాలంటే ఎన్నో ఉపాసనలు చేయాలి. కఠినమైన తపస్సులు ఆచరించాలి. కానీ, రోజూ మనకు ప్రత్యక్షంగా కనిపించే దైవం గురువు. భగవంతుడిని చేరే మార్గాన్ని గురువే చూపిస్తాడు.గురువును ఎందుకు స్మరించాలి ?గురువు ఒక శిల్పి లాంటి వాడు. బండరాళ్లపై అందమైన శిల్పాలు చెక్కి వాటికి పూజార్హత కలిగించగల ప్రజ్ఞాశాలి గురువు. ఓ మంచి గురువు మలచిన శిష్యులు సంస్కారవంతులై సమాజానికి ఉపయోగపడతారు. ఆ విధంగా సమాజసేవ చేస్తున్న గురువును ప్రతినిత్యం స్మరించుకోవడం మన కర్తవ్యం. ప్రత్యేకించి గురువుకు శ్రేష్టమైన గురువారం రోజు గురువును ప్రసన్నం చేసుకోవడానికి ఎలా పూజించాలో చూద్దాం.

గురువారం గురుపూజ ఎలా చేయాలి?

ఒక్కో కుటుంబంలో ఒక్కో గురువును ఆరాధించే సంప్రదాయం ఉంటుంది. ప్రతి గురువారం మీరు ఆరాధించే గురువును ప్రత్యేకంగా పూజించడం వలన నిత్య జీవితంలో ఎదుర్కొనే అనేక సమస్యలకు సులభమైన పరిష్కారం లభిస్తుంది.చదువులో విజయం కోసం

"చదువది ఎంతకల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న" అని భాస్కర శతక పద్యంలో వివరించినట్లుగా ఎన్ని చదువులు చదివినా, ఆ చదువుల సారం గ్రహించలేనప్పుడు ఆ చదువులు వ్యర్థం. గురువును పూజించడం వల్లనే చదువుల సారాన్ని గ్రహించగలిగే బుద్ధిబలం పెరుగుతుంది. అందుకోసం ప్రతి గురువారం గోవును పూజించడం, గోమాతకు గ్రాసం తినిపించడం మంచిది. ప్రతిరోజూ భగవద్గీత నుంచి ఒక్క శ్లోకాన్ని అయినా చదవడం మంచిది.వివాహంలో ఇబ్బందులా!జ్యోతిష్య శాస్త్రం ప్రకారం దేవ గురువు బృహస్పతి అనుగ్రహంతోనే జీవితంలో కళ్యాణ యోగం కలుగుతుంది. జాతకంలో గురువు అనుకూలత లేనప్పుడు ఇంటి గురువును గురువారం రోజు పూజించి, పూజామందిరంలో గురు యంత్రాన్ని స్థాపించాలి. గురువుకు ప్రీతికరమైన శెనగలు నానబెట్టి గోమాతకు తినిపించాలి. అలాగే పసుపు రంగు ప్రసాదాలు, వస్త్రాలు దానం చేయడం వలన గురువు అనుకూలత పెరిగి కళ్యాణ యోగం సిద్ధిస్తుంది.

ఆర్థిక బాధలుఆర్థిక సమస్యలు, ఋణబాధలతో సతమతమవుతున్న వారు గురువారం రోజు గురుచరిత్ర పారాయణ చేయడం, గురు దక్షిణామూర్తి స్తోత్రాలు, దత్తాత్రేయ స్వామి స్తోత్రాలు పఠించడం వల్ల, పేదలకు అన్నదానం చేయడం వల్ల గురువు అనుకూలతతో ఆర్థిక సమస్యలు తొలగుతాయి.

విద్యాబుద్ధులు నేర్పించే గురువులను దైవంతో సమానంగా భావించి పూజించడం మన సంప్రదాయం. గురువు ఆవశ్యకత గ్రహించడం వల్లనే శ్రీరాముడు వశిష్టుని వద్ద, శ్రీకృష్ణుడు సాందీపుని వద్ద విద్య అభ్యసించారు. సాక్షాత్తు దైవ స్వరూపాలైన వారే గురువు వద్ద వినయంగా విద్య అభ్యసించి గురువు ఆవశ్యకతను లోకానికి తెలిపారు. అందుకే గురువును దైవం కన్నా మిన్న అని కూడా అన్నారు.గురువును గౌరవిద్దాం. గురువును పూజిద్దాం. శ్రీ గురుభ్యోనమముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ా విది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# సాంబ్రాణి ధూపం - జుట్టుకు కలిగే అద్భుత ప్రయోజనాలు ఇవే!




ఇప్పుడు తలస్నానం చేయగానే జుట్టు ఆరబెట్టుకోవడానికి హెయిర్ డ్రయర్లు, హిట్ స్టైలింగ్ టూల్స్ ఉన్నాయి. వాటివల్ల జుట్టు దెబ్బతిని హెయిర్?ఫాల్, చుండ్రు లాంటి సమస్యలు వస్తాయి. కానీ, ఒకప్పుడు ఇవేమీ లేకుండానే మన నానమ్మలు, అమ్మమ్మలు తమ జుట్టు ఎంతో ఆరోగ్యంగా, నల్లగా, ఒత్తుగా ఉండేది. ఆ రోజుల్లో ఎలాంటి బ్యూటీ ప్రొడక్ట్స్ లేకుండానే వాళ్లు పాటించిన అద్భుతమైన సహజపద్ధతి ఏంటంటే, తలస్నానం చేశాక జుట్టుకు సాంబ్రాణి ధూపం వేసుకోవడం. ఇలా చేయడం వల్ల తడి జుట్టును ఆరబెట్టడానికి మాత్రమే కాదు, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందట. ఈ క్రమంలో తలస్నానం చేశాక సాంబ్రాణి ధూపం వేసుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం!పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారాల్లో సాంబ్రాణి ధూపం ఒకటి. ఇంట్లో ధూపం వేయటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నమ్మేవారు. చిన్న పిల్లల ఆరోగ్యం నుంచి ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా, సువాసన భరితంగా మార్చుకునేందుకు ఈ సాంబ్రాణి ఉపయోగపడుతుంది. ఈ క్రమంలో వర్షాకాలంలో వాతావరణం తేమగా, చల్లగా ఉంటుంది. ఇలాంటప్పుడు జుట్టుకు సాంబ్రాణి ధూపం వేస్తే ఆరోగ్య సమస్యలు దరికి చేరవని పెద్దలు చెబుతుంటారు.కళ్ల కింద డార్క్? సర్కిల్స్? వచ్చాయా? - ఈ టిప్స్ పాటిస్తే బెటర్ అంటున్న ఎక్స్?పర్ట్స్?!

తేమను తొలగించడానికి : వర్షాకాలంలో గాలిలో తేమవల్ల తలస్నానం చేసిన తర్వాత జుట్టు త్వరగా ఆరదు. దీంతో మాడు మీద ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు వచ్చే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో సాంబ్రాణి ధూపం వేసుకోవడం వల్ల జుట్టులోని తేమను పీల్చుకుని, తలను పొడిగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాదు, ఈ ధూపంలో వేప, తులసి లాంటి మూలికలను వాడటం వల్ల యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు మాడుకు పుష్కలంగా అందుతాయి. ఈ పొగ తలకు తగలగానే మురికి, చెమట, బ్యాక్టీరియా పూర్తిగా నశించిపోతాయి. అంతేకాదు, సాంబ్రాణి పొగలోని మృదువైన వేడి వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇది కుదుళ్లకు బలాన్ని ఇచ్చి, జుట్టు రాలడానికి తగ్గిస్తుంది.

దుర్వాసన దూరం : వానలో తడవడం లేదా తల సరిగ్గా ఆరకపోవడం వల్ల వచ్చే దుర్వాసనను సాంబ్రాణి పొగ పోగొడుతుంది. ఇది సహజ పర్ఫ్యూమ్?లా పనిచేసి, కురులకు మంచి సువాసనను ఇస్తుంది. అంతేకాదు, మెదడును శాంతపరుస్తుంది. వానాకాలం చికాకుగా అనిపించే మూడ్?ను మార్చి, రిలాక్సేషన్?ను ఇస్తుంది. పైగా, సాంబ్రాణికి యాంటీ సెప్టిక్ గుణాలు ఎక్కువ. ఇవి తల మీద దురదను తగ్గించి, కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి.అతిగా వాడితే అనర్థమే : సాంబ్రాణి ధూపం వేసుకునే పద్ధతి జుట్టుకు ఎంతో మంచిదే అయినా, దీన్ని రోజూ అదే పనిలా చేయకూడదు. ఎందుకంటే, దీని నుంచి వచ్చే పొగను మరీ ఎక్కువగా పీల్చడం ఊపిరితిత్తులకు అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. అందుకే, దీన్ని వారానికి ఒకసారి లేదా నెలకు రెండుసార్లు మాత్రమే వేసుకోవాలని సూచిస్తున్నారు.

చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# టీనేజర్ల ఆలోచనలను పేరెంట్స్ - తల్లిదండ్రుల ప్రేమను పిల్లలు అర్థం చేసుకుంటే అన్నీ హ్యాపీడేసే!



టీనేజీలో ఉన్న పిల్లలు .. రెక్కలు తొడుకున్న పక్షుల్లా, రంగు రంగుల సీతాకోక చిలుకల్లా స్వేచ్ఛగా తమ లోకంలో విహరించాలనుకుంటున్నారు. దీంతో నిన్నటి వరకూ తమ చాటున పెరిగిన వాళ్ల వ్యవహారశైలి తల్లిదండ్రులకు ఓ పట్టాన మింగుడుపడదు. అలాగని తప్పంతా ఒకరిదే అనుకోవద్దంటున్నారు నిపుణులు. మరి, ఈ సమస్యకు పరిష్కారం తెలియాలంటే ఇరువర్గాలూ అర్థం చేసుకోవాల్సిన కొన్ని విషయాలు ఉన్నాయని చెబుతున్నారు. మరి,అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!పేరెంట్స్ గమనించండి :వాదించకండి : పిల్లల్ని దారికి తెచ్చుకోవడానికి మొండితనం వద్దంటున్నారు నిపుణులు. వాదనలకు అసలే దిగొద్దట. వాళ్లేం చెబుతున్నారో వినడానికి మీరు సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. ఏదైనా విషయాన్ని ముక్కు సూటిగా కుదరదంటే కుదరదని చెప్పవద్దని సూచిస్తున్నారు. ఒకవేళ మీకు ఇష్టం లేకపోతే కొన్నాళ్లు వాయిదా వేయామని చెప్పాలట. అవసరమైతే కొన్ని షరతులతో ఒప్పుకోమని సలహా ఇస్తున్నారు. ఒప్పుకొంటే అందుకు వారిపై ఉన్న ప్రేమే కారణమని వారికి అర్థమయ్యే విధంగా వ్యవహరించాలట.


బలవంతంగా వద్దు : పిల్లలతో ఏదైనా పనిని బలవంతంగా చేయించాలనుకునే కొద్దీ మరింతగా ప్రతిఘటిస్తారట. అలాగని వదిలేయమని కాదు. నెమ్మదిగా నచ్చజెప్పామంటున్నారు నిపుణులు. ఎందుకు ఇష్టపడటం లేదో తెలుసుకోమని చెబుతున్నారు. ఆ పనిలో అలవాటు పడే వరకూ మీరు తోడుగా ఉండమని సలహా ఇస్తున్నారు. ఎక్కడైనా తగ్గాల్సి వస్తే మీరే ముందుకు రావాలని పేర్కొంటున్నారు. అలాగైనా మీకు వారిపై ఉన్న ప్రేమని అర్థం చేసుకుంటారట.

వయస్సు పెరిగే కొద్ది వేధించే చర్మ సమస్యలు - ఇలా చేస్తే సహజంగా తగ్గించుకోవచ్చట!

ప్రత్యామ్నాయాలు ఇవ్వండి : ఎదిగే పిల్లలు, అభిప్రాయాలు, తెలుసుకోవాలంటున్నారు నిపుణులు. అలా కాకుండా ప్రతి పనిలోనూ ఇలా చేయి, అలా చేయి అని చెబుతుంటే అయిష్టత పెంచుకుంటారని హెచ్చరిస్తున్నారు. ఆ పనులు చేయకుండా ఉండేందుకు ప్రయత్నించడం లేదా వాళ్లకి నచ్చినట్లు చేయడం లాంటివి చేస్తారని తెలియజేస్తున్నారు. అందుకే, ప్రతి పనికీ కొన్ని ప్రత్యామ్నాయాలు ఇస్తే సరిపోతుందని సూచిస్తున్నారు. వారికి ఆప్షన్ ఇచ్చినట్లూ ఉంటుందని సలహా ఇస్తున్నారు. దీంతో మీరు కోరుకున్నదీ జరుగుతుందట.అజమాయిషీ వద్దు : అజమాయిషీ చేయడం వల్ల తమ ఆలోచనలకి, ఇష్టాయిష్టాలకు మీరు అడ్డుపడుతున్నారని పిల్లలు భ్రమపడే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. అలా కాకుండా, ఓ ఫ్రెండ్?గా వారితో గడపాలని సూచిస్తున్నారు. అప్పుడే, మనసు విప్పి మాట్లాడతారని తెలియజేస్తున్నారు. ఏదైనా వారికి అదే పనిగా ఉపన్యాసంలా కాకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నట్లే ఏ విషయమైనా చెప్పాలని సలహా ఇస్తున్నారు. ఇంట్లో పనులు లేదా ఉద్యోగం రీత్యా మీరు టైం లేకున్నా.. రోజులో కొంత సమయం వాళ్లకు కేటాయించామంటున్నారు. ఇది మీ మధ్య బంధాన్ని బలపరుస్తుందని వివరిస్తున్నారు.

పిల్లలూ ఆలోచించండి :ఆ ఉద్దేశం తెలుసుకోండి : పేరెంట్స్ అనుభవంతో చెబుతారు. సలహాలు ఇవ్వడం, ఆంక్షలు పెట్టడం వెనుక ఉద్దేశం మీ సంక్షేమమే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే, వాళ్లేం చెబుతున్నారో ఓ సారి వినాలంటున్నారు. వారి బాధ, ఆందోళనల్ని అర్థం చేసుకోమని పేర్కొంటున్నారు. ఆ తర్వాత వాళ్లకు ఏం చెప్పాలి? ఎలాంటి భరోసా ఇవ్వాలనేది మీకే తెలుస్తుందని వివరిస్తున్నారు.ఉక్రోషం వద్దు : అనుకున్నది సాధించాలనే పంతం ఉండటం మంచిదే. కానీ, ఈ ఉక్రోషం కాస్తా కోపంగా మారితే.. మాటలే తూటాలవుతాయంటున్నారు నిపుణులు. ఆ ఒత్తిడిలో ఎదుటివారు నొచ్చుకునేలా దూసుకెళ్తాయని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదిరించడం, వాదించడం వల్ల సమస్య మరింత పెద్దది అవుతుందని పేర్కొంటున్నారు. మీరు చెప్పాలనుకున్న విషయం ఏదైనా శాంతంగా చెప్పామని సూచిస్తున్నారు. మీరు కోరింది ఏదైనా ఇప్పుడే కావాలని తెలియజేస్తున్నారు. ఈ రోజే చేయాలని అనొద్దట. వారికి ఆలోచించుకునే అవకాశం ఇవ్వాలని చెబుతున్నారు. మీరు టైం తీసుకోమంటున్నారు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పితే.. కచ్చితంగా మిమ్మల్ని అర్థం చేసుకుంటారట.స్పష్టంగా చెప్పండి : మీ మనసులో వంద కోరికలు, ఆలోచనలు ఉండొచ్చు. వాటిని లోపలే ఉంచుకుని బయటికి మాత్రం వేరే విషయాలపై గొడవపడటం వల్ల ఉపయోగం ఉండదంటున్నారు నిపుణులు. మీరేం అనుకుంటున్నారో వారితో ధైర్యంగా చెప్పామని చెబుతున్నారు. అంతేకాదు, ఆ పని చేయడం వల్ల మీ హద్దుల్ని మరిచిపోననే విషయంలో వారికి భరోసా ఇవ్వమంటున్నారు. అప్పుడు వాళ్లూ మిమ్మల్ని నమ్ముతారని వివరిస్తున్నారు.రాజీ పడాల్సిందే : పేరెంట్స్, టీనేజర్లు ఇద్దరూ కొన్నిసార్లు రాజీ పడాలంటున్నారు నిపుణులు. ఎలాగంటే, ఫ్రెండ్స్?తో ఎక్కువ సమయం గడపాలనుకుంటే.. పేరెంట్స్ పెట్టిన సమయ పరిమితిని అంగీకరించాలని సలహా ఇస్తున్నారు. ఎలాంటి బంధంలోనైనా సర్దుకుపోయినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొంటున్నారు. సలహా తీసుకోండి : ప్రతి సమస్యనూ మేమే పరిష్కరించుకోగలమని అనుకోవద్దంటున్నారు నిపుణులు. కొన్నింటికి అనుభవం అవసరమని చెబుతున్నారు. అందుకే, కష్టాన్ని, ఇబ్బందుల్ని మనసులో పెట్టుకోవద్దని తెలియజేస్తున్నారు. అమ్మానాన్నలతో మనసు విప్పి మాట్లాడటం, సలహా తీసుకోవడం మంచిదట.టీనేజీ పిల్లలు స్వతంత్రంగా ఉండాలనుకోవడం, ఫ్రెండ్స్?తో గడపాలనుకోవడం సర్వసాధారణం. ఆ మార్పుని పేరెంట్స్? గుర్తించడమే కాదు, అంగీకరించాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మీ పిల్లలు చేసే పనులు మీకు నచ్చకపోవచ్చట. కానీ, అవి హానికరం కానంత వరకూ చూసి చూడనట్లు వదిలేయడమే మేలని చెబుతున్నారు. అదే సమయంలో పొరపాటు జరిగినా సరే, పిల్లలు వచ్చి చెప్పుకొనే కమ్యూనికేషన్ మీ మధ్య ఉండాలని సూచిస్తున్నారు. అలాగే, పిల్లలు కూడా ఓ విషయాన్ని అర్థం చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ వయసులో ఉత్సాహం, ఉద్రేకం అన్నీ ఎక్కువగానే ఉంటాయట. మీరు చేసే పని ఏదైనా సరే.. మీ కల్చర్, విలువలు, కుటుంబ పరిస్థితులకి సరిపడుతుందా? మీ ఫ్యామిలీ అంగీకరిస్తుందా అన్నది ఆలోచించుకోవాలని పేర్కొంటున్నారు. అలా కాకుండా ఇతరుల్లా మీరు ఉండాలనుకోవడం, పీర్ ప్రెజర్?లో పడి ఎదుటి వారిలా మీరూ ఉండాలని ప్రయత్నించడం మంచిది కాదని తెలియజేస్తున్నారు. ఏ సమస్య ఉన్న పేరెంట్స్?తో చెబితే సరిపోతుందని సూచిస్తున్నారు. వాళ్లు అర్థం చేసుకోవడం లేదనిపిస్తే అవసరాన్ని బట్టి మానసిక నిపుణుల సాయం తీసుకోవడం మంచిదట.

# శ్రీకృష్ణుడికి ఒక్క నమస్కారం ఎంత విలువైందో తెలుసా? - రోజూ చేశారంటే ఎంతో ఫలం అంటున్న పండితులు!



దేవుడికి, గురువులకు, పెద్దలకు నమస్కారం చేస్తుంటాం. మనలో ఉన్న అహంకారాన్ని తగ్గించజేసి, పరమాత్మ భావాన్ని అంతటా దర్శించడమే నమస్కారంలో ఉన్న అంతరార్థం అని ఆధ్యాత్మిక ప్రవచనకర్త మాచిరాజు కిరణ్ కుమార్ తెలిపారు. మన సంప్రదాయంలో నమస్కారానికి ఉన్న ప్రాధాన్యత ఏంటి? అవి ఎన్ని రకాలు? రోజూ శ్రీకృష్ణుడికి నమస్కారం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.సంప్రదాయ గ్రంథాల ప్రకారం నమస్కారమునకు ఉన్న ప్రాధాన్యతను పరిశీలిస్తే, నమస్కారము అంటే 'నేను నీకంటే తక్కువ వాడిని, నేను నీకు దాసుడిని' అని అర్థం. మనలో ఉన్నటువంటి అహంకారాన్ని తగ్గింపచేసుకుని పరమాత్మ భావాన్ని అంతటా దర్శించడమే నమస్కారంలో ఉన్న అంతరార్థం. అందుకే ధర్మశాస్త్ర గ్రంథాలు ఏం చెబుతాయంటే, అనేక వేల అశ్వమేధ యాగాలు చేసిన తర్వాత అవభృథ స్నానం అని ఒక ప్రత్యేక స్నానమాచరిస్తారు. ఆ అవభృథ స్నానం అనేది కొన్ని కోట్ల జన్మల పాపాలన్నీ పటాపంచలు చేస్తుందట.

రోజూ శ్రీకృష్ణుడిని పూజిస్తే

అవభృథ స్నానం అనే ప్రత్యేక స్నానం ఎంతటి అద్భుత ఫలితాలను కలిగింపజేస్తుందో శ్రీకృష్ణ పరమాత్మకు ఒక్క నమస్కారం చేస్తే అది అంతటి అద్భుత ఫలితాలను కలిగింపజేస్తుందని ప్రామాణిక గ్రంథాలన్నీ తెలియజేస్తున్నాయి. అందుకే, రోజూ తప్పకుండా శ్రీకృష్ణ పరమాత్మకు ఒక్క నమస్కారం చేసుకుని మన కార్యక్రమాలను ప్రారంభించినట్లయితే అద్భుతమైన శుభ ఫలితాలను సిద్ధింపచేసుకోవచ్చంటున్నారు ఆధ్యాత్మికవేత్త మాచిరాజు. గురువులు, పెద్దలు, ఎవరు కనిపించినా సరే నమస్కరించడం ద్వారా విప్రయోజనాలు చేకూరతాయంటున్నారు.

నమస్కారం ఎన్ని రకాలంటే?

నమస్కారం అనేది 'కాయికం, వాచికం, మానసికం' అని మూడు రకాలుగా ఉంటుంది. కాయికం అంటే శరీరంతో చేసే నమస్కారం అని అర్థం. వాచకం అంటే మాటతో చేసే నమస్కారం. ఇక మానసికం అంటే మనసులో ఎదుటివారికి నమస్కారం చెప్పుకోవడం. వీటిల్లో ఏ నమస్కారమైన ఉత్తమ ప్రయోజనాలను కలిగింపజేస్తుందంటున్నారు జ్యోతిష్యులు మాచిరాజు.మన సంప్రదాయ గ్రంథాల్లో 'కాయికం' అనే నమస్కారాన్ని మళ్లీ నాలుగు రకాలుగా చెప్పారు. అవేంటంటే, ఏకాంగ నమస్కారం, త్రయాంగ నమస్కారం, పంచాంగ నమస్కారం, సాష్టాంగ నమస్కారం.

ఏకాంగ నమస్కారం అంటే ఏమిటంటే, ఎవరైనా పెద్దలు కానీ, గురువులు కానీ కనిపించినప్పుడు కేవలం శిరస్సు వంచి నమస్కారం చేయడం. ఇది కూడా ఉత్తమ ఫలితాలను కలిగింపజేస్తుందంటున్నారు.

త్రయాంగ నమస్కారం అంటే ఏమిటనగా, పెద్దలు, గురువులు కనిపించినప్పుడు శిరస్సు వంచి రెండు చేతులు శిరస్సు మీద ఉంచి చేసే నమస్కారం. అయితే, ఏకాంగ నమస్కారం, త్రయాంగ నమస్కారం కంటే పంచాంగ నమస్కారం, సాష్టాంగ నమస్కారం అద్భుతమైన శుభఫలితాలను కలిగింపజేస్తాయని చెబుతున్నారు.పంచాంగ నమస్కారం విషయానికొస్తే, శిరస్సు, రెండు చేతులు, రెండు భుజాలు మోకాళ్ల మీద ఉంచి మోకాళ్ల మీద చేసే నమస్కారంను 'పంచాంగ నమస్కారం' అనే పేరుతో పిలుస్తారు."పూజ" చేసేటప్పుడు నేల మీద కూర్చోకూడదంటారు ఎందుకు? - మరి ఎలా చేస్తే మంచి ఫలితాలు?సాష్టాంగ నమస్కారం అంటే ఏమిటంటే, రెండు చేతులు, రెండు భుజాలు, శిరస్సు, గడ్డం, రెండు చెవులు వీటన్నింటిని కూడా నేల మీద ఉంచి మోకరిల్లి చేసే నమస్కారాన్ని "సాష్టాంగ నమస్కారం" అంటారు. అన్ని నమస్కారాల కంటే ఇది చాలా శక్తివంతమైనది, గొప్పదిగా చెబుతారు.

శరీరంలో ఉన్నటువంటి ఎనిమిది అవయవాలతో చేసే నమస్కారం అని అర్థం. పెద్ద పెద్ద గురువులకు, దైవానికి సాష్టాంగ నమస్కారం చేస్తే ఫలితం అనేది చాలా అద్భుతంగా ఉంటుంది. అయితే, పురుషులు మాత్రమే సాష్టాంగ నమస్కారం చేయాలి. స్త్రీలు ఈ నమస్కారం చేయరాదు. మహిళలు పంచాంగ నమస్కారం మాత్రమే చేయాలి.

ఎటువంటి నమస్కారం చేయటానికి వీలుకానీ పక్షంలో అంజలి బంధం చూపించాలని చెబుతున్నారు జ్యోతిష్యులు మాచిరాజు. దేవాలయానికి వెళ్లినప్పుడు అక్కడ భగవంతుడే గొప్పవాడు. అందుకే, దేవాలయంలో పెద్ద పెద్ద గురువులు, పీఠాధిపతులు దేవాలయంలో కనిపించినప్పటికీ అక్కడ వారికి సాష్టాంగ నమస్కారం చేయకూడదు.దేవాలయం దాటి బయటకు వచ్చాకే వారికి సాష్టాంగ నమస్కారం చేయాలి. అటువంటప్పుడు దైవస్వరూపమైనవారు, పీఠాధిపతులు, గురువులు, యతులు దేవాలయంలో కనిపించినప్పుడు వాళ్లకి అంజలి బంధం చూపించాలి.

అంజలి బంధం అంటే ఏమిటంటే, అరచేతులను పూర్తిగా మూసి ఉంచకుండా కొద్దిగా ఓపెన్ చేసి ఉంటే దాన్ని అంజలి బంధం అంటారు. అలా అంజలి బంధంతో గురువులకు నమస్కార భావన చూపించినట్లయితే నీ పట్ల నేను దాసుడిగా ఉన్నాననే అర్థం వస్తుంది.

అలాగే, ఎప్పుడైనా సరే గురువుల పాద పద్మాలకు నమస్కరించేటప్పుడు లేదా పెద్ద పెద్ద వారి పాద పద్మాలకు నమస్కరించేటప్పుడు మన కుడి చేయి వారి కుడి పాదం మీద, ఎడమ చేయి ఎడమ పాదం మీద ఉండాలి. అలా ఉంచేటప్పుడు కూడా కుడి చేయి పైన ఉండాలి. ఎడమ చేయి కింద ఉండాలి. ఆవిధంగా చేతులను ఉంచి నమస్కారం చేసినట్లయితే దాని వల్ల గురువుల సంపూర్ణమైన అనుగ్రహం కలుగుతుంది. గురు బలాన్ని పెంపొందింపచేసుకోవచ్చంటున్నారు . ఇలా మీరూ నమస్కారంలో ఉన్న ప్రత్యేక విధివిధానాలు పాటిస్తూ నమస్కార భావనతో మెలగండి. అంతటా ఉన్నటువంటి భగవంతుడి అనుగ్రహానికి సులభంగా పాత్రులు అవ్వండి అని చెబుతున్నారు ఆధ్యాత్మిక ప్రవచనకర్త మాచిరాజు కిరణ్ కుమార్.

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు

# సామాజిక సమానత్వమే ఎమ్మార్పీఎస్ గమ్యం: కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం



**హనుమకొండ, జూలై 7 :** సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపి సాంఘిక సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ గమ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామచంద్రం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ పాలకుల కుట్రలను, అడ్డంకులను ఎదుర్కొంటూ ఎమ్మార్పీఎస్ 32 ఏళ్లుగా సజీవంగా నిలిచిందంటే దానికి మందకృష్ణ మాదిగ సమర్థవంతమైన నాయకత్వమే కారణమని అన్నారు. భారత దేశంలోనే సుదీర్ఘంగా సాగుతున్న ఏకైక సామాజిక ఉద్యమం ఇదేనని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన ద్వారా మొదటి దశలో సుమారు 25 వేల ఉద్యోగాలను అందించడంతో పాటు మాదిగ జాతికి ఆత్మగౌరవం, గుర్తింపు తెచ్చిందని గుర్తుచేశారు. ?కేవలం వర్గీకరణే కాకుండా.. గుండె జబ్బుల చిన్నారులు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, అనాథ పిల్లల సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఈ ఉద్యమాన్ని 32 ఏళ్లుగా ఆదరిస్తున్న మాదిగ ప్రజలకు, మద్దతుగా నిలిచిన అన్ని వర్గాల ప్రజలకు వక్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు సమ్మయ్య, ఎల్.పి. రాజ్ కుమార్, డాక్టర్ పోడేటి శ్రీనివాస్, వివిధ అనుబంధ సంఘాల (మీఫీ) నాయకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు షీ టీమ్స్ అండ

- విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం
- వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయాలి
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యమే



**నాగర్‌కర్నూల్, జూలై 7 :** మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఆదేశాల మేరకు పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీమ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీమ్ మహిళా సహాయ ఉప పరిశీలకురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, అసభ్య ప్రవర్తన, ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు వంటి మహిళలు, బాలికలు ఎదుర్కొనే ప్రతి సమస్యపై షీ టీమ్స్ తక్షణమే స్పందిస్తాయని తెలిపారు. మహిళలు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలు స్వేచ్ఛగా, సురక్షితంగా జీవించే వాతావరణం కల్పించడమే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. వేధింపులకు గురైన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత గోప్యంగా ఉంచి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళల సహాయం కోసం అత్యవసర పరిస్థితుల్లో డయల్--100కు లేదా షీ టీమ్స్ ప్రత్యేక సహాయ సంఖ్య 8712657676కు ఫోన్ చేయవచ్చని వివరించారు. సమీప పోలీస్ స్టేషన్‌ను కూడా నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, జాగ్రత్తలు, పోలీసు సేవల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

# ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌హెచ్‌ఓ కార్యాలయం ప్రారంభం

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభం
- గంజాయిపై రాజీలేని పోరాటం
- ఉత్తమ సిబ్బందికి నగదు బహుమతులు




**ఆదిలాబాద్, జూలై 7 :** ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌హెచ్‌ఓ కార్యాలయాన్ని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల నిర్మూలన, ట్రాఫిక్ అమలు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నిర్మూలనకు రాజీలేని విధంగా చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచాలని ఎస్పీ ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే పోలీసు సిబ్బందిని ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తామని అఖిల్ మహాజన్ ప్రకటించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణలో ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలన, ప్రజల భద్రత, సమర్థవంతమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ కార్యాచరణ కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.


# ఏ విటమిన్ లోపం ఉంటే బరువు పెరుగుతారో తెలుసా? పాటించాల్సిన డాక్టర్ చిట్కాలు!



శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే సరైన పోషకాలు అవసరం. పోషకాలు సరిగ్గా అందితే శారీరక, మానసిక అభివృద్ధి బాగుంటుంది. అందుకే వైద్యుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోమని సలహా ఇస్తారు. శరీరం తన విధుల్ని సరిగ్గా నిర్వర్తించడానికి అనేక పోషకాలు అవసరం. అయితే, ఏదైనా పోషక లోపం ఉంటే అనేక సమస్యలు తలెత్తుతాయి. మరీ, విటమిన్ల లోపం వల్ల బరువు పెరుగుతారా?
ఈ రోజుల్లో బరువు పెరగడం అనేది ఒక సాధారణ సమస్యగా మారింది. ఇది దాదాపు ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతోంది. చాలా మంది బరువు తగ్గేందుకు అనేక ప్రయత్నాలు చేస్తారు. కానీ కొన్నిసార్లు ఈ ప్రయత్నాలు ఫలించవు. బరువు పెరగడానికి అనేక కారణాలు ఉండొచ్చు. ఏదైనా విటమిన్ లోపం వల్ల బరువు పెరుగుతామా? అనే సందేహం చాలా మందికి ఉంది. కేవలం విటమిన్ల లోపం వల్లే నేరుగా బరువు పెరగడం అనేది చాలా అరుదుగా జరుగుతుందని డాక్టర్ కోన లక్ష్మి కుమారి(కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, మినిమల్ యాక్సెస్ ఌ రోబోటిక్ జీఐ సర్జన్, మెటబాలిక్ అండ్ బారియాట్రిక్ సర్జన్, యశోద హాస్పిటల్స్, హైదరాబాద్) తెలిపారు.
అయితే, కొన్ని రకాల పోషకాల లోపం వల్ల మన శరీర జీవక్రియలు, శక్తి స్థాయిలు, ఆకలి, హార్మోన్ల పనితీరు దెబ్బతింటాయి. దీనివల్ల పరోక్షంగా బరువు పెరిగే అవకాశం ఉంది. ఒక వ్యక్తి మంచి జీవనశైలిని పాటిస్తున్నప్పటికీ బరువు పెరుగుతుంటే, వైద్య పరీక్షల ద్వారా పోషకాహార లోపాలు ఏమైనా ఉన్నాయేమో చూసుకోవడం చాలా ముఖ్యం. బరువు పెరగడానికి కారణమయ్యే సాధారణ లోపాలు, పాటించాల్సిన జాగ్రత్తలు గురించి డాక్టర్ కోన లక్ష్మి కుమారి పూర్తి వివరాలు అందించారు.
విటమిన్ డి లోపం: శరీరంలో విటమిన్ డి స్థాయిలు తగ్గడం వల్ల శరీరంలో కొవ్వు పెరగడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ (ఇన్సులిన్ సరిగ్గా పనిచేయకపోవడం), కండరాల బలం తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. విటమిన్ డి లోపం ఉన్నవారు తరచూ అలసటగా ఫీలవుతారు. దీనివల్ల శారీరక శ్రమ తగ్గి, బరువు పెరిగే అవకాశం పెరుగుతుంది.
ఐరన్ లోపం: శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను చేరవేయడానికి, శక్తి ఉత్పత్తికి ఐరన్ చాలా అవసరం. ఐరన్ లోపం వల్ల తీవ్రమైన అలసట వస్తుంది, వ్యాయామం చేసే సామర్థ్యం తగ్గుతుంది. కేలరీలు కరిగే వేగం మందగిస్తుంది. ఇది పరోక్షంగా బరువు పెరగడానికి కారణమవుతుంది.
విటమిన్ బి12 లోపం: మనం తినే ఆహారాన్ని శక్తిగా మార్చడంలో విటమిన్ బి12 కీలక పాత్ర పోషిస్తుంది. దీని లోపం వల్ల నీరసం, బలహీనత, శారీరక శ్రమ చేయలేకపోవడం వంటి సమస్యలు వస్తాయి. ఇది నేరుగా బరువును పెంచకపోయినా, బరువును అదుపులో ఉంచుకోవడాన్ని కష్టం చేస్తుంది.
మెగ్నీషియం లోపం: గ్లూకోజ్ జీవక్రియ, ఇన్సులిన్ పనితీరులో మెగ్నీషియం సాయపడుతుంది. శరీరంలో మెగ్నీషియం స్థాయిలు తగ్గితే బ్లడ్ షుగర్ నియంత్రణ తప్పుతుంది. తీపి
కేవలం విటమిన్ టాబ్లెట్లు వేసేసుకుంటే బరువు తగ్గిపోరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. బ్లడ్ టెస్టుల్లో ఏదైనా లోపం ఉన్నట్లు తేలితే, డాక్టర్ సలహాతో వాటిని సరిచేసుకోవడం ద్వారా మీ శక్తి స్థాయిలు పెరుగుతాయి, మెటబాలిజం మెరుగవుతుంది. ఇది మీరు ఆరోగ్యకరమైన లైఫ్‌స్టైల్‌ను పాటించడానికి సాయపడుతుంది.
పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్ (తక్కువ కొవ్వు ఉన్న మాంసం/పప్పులు), నట్స్, గింజలు వంటి రకరకాల పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలి.
సహజంగా విటమిన్ డి లభించడం కోసం రోజులో కొంత సమయం ఎండలో గడపాలి.
మెటబాలిజం పెరగడానికి, కండరాల్ని బలంగా ఉంచుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
ఆకలిని నియంత్రించే హార్మోన్లు సరిగ్గా పనిచేయాలంటే తగినంత నిద్ర, మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవడం చాలా ముఖ్యం.
?థైరాయిడ్, హార్మోన్ల లింక్: బరువు పెరగడానికి, విటమిన్ లోపాలకు థైరాయిడ్ సమస్యలతో దగ్గరి సంబంధం ఉంటుంది. ముఖ్యంగా హైపోథైరాయిడిజం ఉన్నవారిలో విటమిన్ డి, బి12 లోపాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇది మెటబాలిజంను బాగా తగ్గించేసి బరువు పెరిగేలా చేస్తుంది.
గట్ హెల్త్: మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియా సరిగ్గా లేకపోతే పోషకాల గ్రహణ శక్తి తగ్గుతుంది. దీనివల్ల మనం మంచి ఆహారం తిన్నా విటమిన్లు శరీరానికి అందవు, ఫలితంగా బరువు పెరుగుతారు. కాల్షియం లోపం: కొన్ని పరిశోధనల ప్రకారం, శరీరంలో కాల్షియం లోపం ఉన్నప్పుడు శరీరం ఎక్కువ కొవ్వును నిల్వ చేసుకునే అవకాశం ఉందట. విటమిన్ డి లోపం ఉన్నప్పుడు కాల్షియం కూడా సరిగ్గా అబ్జార్బ్ అవ్వదు. ఒత్తిడి హార్మోన్ (మానసిక ఒత్తిడి ఎక్కువైనప్పుడు శరీరంలో 'కార్టిసాల్' అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది పొట్ట భాగంలో కొవ్వు పేరుకుపోయేలా చేస్తుంది. బి-విటమిన్లను శరీరం చేస్తుంది.


# పైల్స్ సమస్య తగ్గడానికి ఇంటి చిట్కాలు, చాలా సింపుల్ కరక్కాయ ం బెల్లం చాలు!

నేటి ఆధునిక జీవనశైలి కారణంగా సంప్రదాయ ఆహారం స్థానంలో ఫాస్ట్‌ఫుడ్స్ వచ్చేశాయి. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అందులో ప్రధానమైన సమస్య పైల్స్, మొలలు. పైల్స్ సమస్య కారణంగా చాలామంది ఇబ్బంది పడుతుంటారు. పైల్స్ పేషెంట్స్ కూర్చున్నా, పడుకున్నా కూడా ఎంతో బాధ భరిస్తుంటారు. కొన్ని ఆయుర్వేద చిట్కాలు పైల్స్ సమస్యను పరిష్కరించడానికి సహాయపడతాయి. వాటిలో కరక్కాయ, బెల్లం మిశ్రమం ఒక్కటి. ఈ మిశ్రమం ఎలా తయారు చేయాలి, దీన్ని ఎలా తయారు చేసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.. పైల్స్ పేషెంట్స్ బాధ వర్ణించలేం. కూర్చున్నా, పడుకున్నా ముళ్లపై కూర్చున్నట్లే ఉంటుంది. పైల్స్ వల్ల మలద్వారం వద్ద తీవ్రమైన నొప్పి వస్తుంది. సూదులతో గుచ్చినట్లు ఉంటుంది. దురద, మంట ఇబ్బంది పెడతాయి. కొన్నిసార్లు మలం నుంచి రక్తం కూడా వస్తుంది. మలద్వారం వద్ద రక్తనాళాలు బుడిపెల్లాగా ఉబ్బి, అక్కడేదో ఉన్నట్లుగానూ ఉంటుంది. ఏదైనా ఒత్తిడి పెరిగినప్పుడు, లేదా రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడినప్పుడు రక్తనాళాల్లో వాపు ఏర్పడవచ్చు. మలద్వారం వద్ద ఈ వాపు ఏర్పడినప్పుడు దాన్ని పైల్స్ అంటారు. కొన్ని సార్లు మలంలో రక్తం చుక్కలు పడతాయి. చెడు ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, అధిక బరువు, పీచు పదార్థాలు తక్కువగా తీసుకోవడం వల్ల పైల్స్ వచ్చే అవకాశం ఉంది. పైల్స్ సమస్యను తగ్గించడానికి ఆయుర్వేదంలో కొన్ని చిట్కాలు సహాయపడతాయి. వాటిలో కరక్కాయ, బెల్లం మిశ్రమం ఒకటి. ఇది ఎలా సహాయపడుతుంది, దీన్ని ఎలా తీసుకోవాలో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం..
కరక్కాయ శక్తివంతమైన ఆయుర్వేద మూలికల్లో ఒకటి.



కరక్కాయ జీర్ణక్రియకు సహాయపడి, మొలలకు సాధారణ కారణమైన మలబద్ధకాన్ని నివారిస్తుంది. దీనిలో ఉండే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. ఇన్‌ఫ్లమ్డ్ హెమరాయిడ్స్ నుంచి ఉపశమనం ఇస్తాయి. కరక్కాయలోని ఆస్ట్రింజెంట్ గుణాలు రక్తస్రావాన్ని తగ్గించి, కణజాలం నయం కావడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులో అనేక ఔషధ గుణాల ౧ ఉన్నాయని జుజీ×వీ అధ్యయనం పేర్కొంది.
కరక్కాయ పొడి బెల్లం వేస్తే.. కరక్కాయ చేదు తగ్గుతుంది. కరక్కాయ, బెల్లం మిశ్రమం జీర్ణక్రియకు కూడా అనుకూలంగా ఉంటుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఈ కాంబినేషన్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, మొలల సంబంధిత రక్తస్రావాన్ని కంట్రోల్‌లో ఉంచుతుంది. అంతేకాకుండా బెల్లం కూడా అనేక సమస్యలకు ఉపయోగపడుతుందని అధ్యయనం పేర్కొంది. ఈ మిక్స్ తయారు చేసుకోవడానికి కరక్కాయ పొడి అర టీస్పూన్ నుంచి ఒక టీస్పూన్ తీసుకోండి. దానిలో ఒక టీ స్పూన్ బెల్లం మిక్స్ చేయండి. రెండిటినీ బాగా మిక్స్ చేసి రాత్రి భోజనం చేసిన తర్వాత లేదా పడుకునే ముందు గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోండి. మొదట తక్కువ మోతాదులో ప్రారంభించడం మంచిది. అలాగే ఒకసారి నిపుణుల సలహా తీసుకుని ఆ తర్వాత తీసుకోవడం కూడా మంచిది.
గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్న పిల్లలు, తరచుగా విరేచనాల కారణంగా బాధపడేవారు వైద్యుల సలహా లేకుండా ఈ మిశ్రమాన్ని తీసుకోకూడదు. అలాగే ఇతర మందులు వాడుతున్నవారు కూడా ముందుగా వైద్యుడిని సంప్రదించడం మంచిది. వైద్యుడిని సంప్రదించిన తర్వాత వారి సలహా మేరకు నిర్ణయం తీసుకోండి. మీరు పైల్స్ కారణంగా బాధపడుతుంటే ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకుంటే మొలలు మృదువుగా మారతాయి. మలవిసర్జన సమయంలో నొప్పి, మంట, అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు తాగండి. పోషకాహారం తీసుకోండి. వ్యాయామం చేయండి. మలాన్ని ఆపుకోకుండా సమయానికి విసర్జించడం చాలా ముఖ్యం. మలంలో రక్తం ఎక్కువగా రావడం, తీవ్రమైన నొప్పి, లక్షణాలు ఎక్కువ రోజులు కొనసాగితే తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.
ముఖ్య గమనిక: ఈ కథనంలోని సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, కొందరు నిపుణులు పేర్కొన్న అంశాల ఆధారంగా తెలియజేశాము. వీటిని పాటించే ముందు నిపుణుల సలహా తీసుకోండి. అలాగే వీటిని ఎంత వరకు పాటించాలనేది, విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం. సమయం
తెలుగు వీటిని ధృవీకరించడం లేదు.

# మినీ స్ట్రోక్.. ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడటంలో ఇబ్బంది, చేతులు లేదా కాళ్లలో అకస్మాత్తుగా బలహీనత, కొద్దిసేపు చూపు మసకబారడం వంటి లక్షణాలు కనిపించి... కొన్ని నిమిషాల్లో తగ్గిపోతే వాటిని చిన్న సమస్యగా తీసుకోవద్దు. ఇవి మినీ స్ట్రోక్ లేదా ట్రాన్సియెంట్ ఇస్కీమిక్ అటాక్‌సంకేతాలు కావచ్చు. ఇది భవిష్యత్తులో వచ్చే తీవ్రమైన స్ట్రోక్‌కు ముందస్తు హెచ్చరికగా భావిస్తారు. మినీ స్ట్రోక్ అంటే ఏమిటి? మెదడులోని ఒక భాగానికి కొద్దిసేపు రక్తప్రసరణ తగ్గిపోవడం లేదా ఆగిపోవడం వల్ల మినీ స్ట్రోక్ వస్తుంది. లక్షణాలు కొన్ని నిమిషాలు లేదా గంటలోపే తగ్గిపోయినా, ప్రమాదం పూర్తిగా తొలగిపోయిందని భావించకూడదు. సరైన చికిత్స తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద స్ట్రోక్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మినీ స్ట్రోక్ లక్షణాలుముఖం ఒకవైపు వాలిపోవడంఒక చేయి లేదా కాలు బలహీనంగా అనిపించడం లేదా స్పర్శ తగ్గిపోవడంమాట్లాడటంలో లేదా ఇతరులు చెప్పేది అర్థం చేసుకోవడంలో ఇబ్బందిఒకటి లేదా రెండు కళ్లలో చూపు మసకబారడం లేదా తగ్గిపోవడంఅకస్మాత్తుగా తలతిరగడం, సమతుల్యత కోల్పోవడంకారణం లేండా తీవ్రమైన తలనొప్పిఈ లక్షణాలు కొద్దిసేపటికే తగ్గిపోయినా వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి. ఎవరికి ప్రమాదం ఎక్కువ? అధిక రక్తపోటు ఉన్నవారుమధుమేహం ఉన్నవారుఅధిక కొలెస్ట్రాల్ ఉన్నవారుధూమపానం చేసేవారు ఊబకాయంతో బాధపడేవారుగుండె జబ్బులు ఉన్నవారు55 సంవత్సరాలు పైబడినవారుకుటుంబంలో స్ట్రోక్ చరిత్ర ఉన్నవారుస్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనది. లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి చేరుకుంటే మెదడుకు కలిగే నష్టాన్ని తగ్గించే చికిత్స అందించే అవకాశం ఉంటుంది. మినీ స్ట్రోక్‌ను ఎలా నివారించాలి? రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి.
వైద్యుడు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి. మినీ స్ట్రోక్ వచ్చిన అనుమానం ఉంటే ఆలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

# గుర్రంపోడు ఆదర్శ పాఠశాలలో నేరుగా ప్రవేశాలు



గుర్రంపోడు, జూలై 07, :నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రధానమంత్రి ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న సీట్లకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి. రాగిణి ఒక ప్రకటనలో తెలిపారు .పాఠశాల విభాగంలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో గణితం–భౌతిక శాస్త్రం–రసాయన శాస్త్రం, జీవశాస్త్రం– రసాయన శాస్త్రం, పౌరశాస్త్రం–అర్థశాస్త్రం–వాణిజ్య శాస్త్రం,అకౌంట్స్ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్లకు నేరుగా చేరికలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. తమ సంస్థలో చేరే విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తామని వెల్లడించారు. ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు జాతీయ విద్యార్థి దళం (ఎన్‌సీసీ) శిక్షణ, అత్యాధునిక సమాచార సాంకేతిక ల్యాబ్, ప్రయోగశాల సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సాంకేతిక నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ విభాగాలలో వృత్తి విద్యా కోర్సులతో పాటు యోగా, సంగీతం, కరాటే తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల తల్లిదండ్రులు వెంటనే 9397320844 నంబర్‌లో సంప్రదించి ప్రవేశాలు పొందాలని కోరారు.

# గుర్రంపోడులో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

గుర్రంపోడు,జూలై:07 :నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ గుర్రంపోడు మండల అధ్యక్షులు కొమ్ము రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను కొమ్ము రమేష్ ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.


ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కొమ్ము రమేష్ మరియు పలువురు నాయకులు మాట్లాడుతూ.. మాదిగల హక్కుల కోసం, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ గత మూడు దశాబ్దాలుగా చేసిన పోరాటాలు అమోఘమైనవని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు, ఎమ్మార్పీఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ మండల ఉప అధ్యక్షులు రేపాక నరసింహ, సీనియర్ నాయకులు మారపాక గిరి, దున్న



ఈదయ, మేడి సైదులు, మేడి వెంకన్న, రేపాక లక్ష్మీపతి, రేపాక సాయిలు, మేడి లాలు, ఆడెపు ఎల్లయ్య, మారపాక లింగయ్య, పోలేని మనోజ్ కుమార్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్బవ దినోత్సవం సామాజికంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం దేశానికి పెద్ద దిక్కు



చిలుకూరు : జూలై 07, :మండలంలోని బేతవోలు గ్రామంలో నేడు యంఆర్పియస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యంఆర్పియస్ మరియు పలువురు గ్రామపెద్దల సమక్షంలో కార్యక్రమాలను ఘణంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో యంఆర్పియస్ గ్రామశాఖ అధ్యక్షులు నెమ్మాది.మహేష్ కార్యదర్శి వంగూరి. నవీన్ బియస్పి గ్రామశాఖ కన్వీనర్ మాతంగి ప్రసాద్ స్వేరోస్ మండల కన్వీనర్ కత్తి. సందీప్,యంఆర్పియస్ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు మంద.రమేష్, బాబు జగ్జీవన్ రామ్ గ్రామశాఖ అధ్యక్షులు చినపంగు.యాదగిరి, నెమ్మాది కుటుంబరావు గ్రామపెద్దలు మామిడి బసవరాజు సీనియర్ యంఆర్పియస్ నాయకులు పలువురు పాల్గొని విజయవంతం చేశారు.

# డబ్బా గ్రామంలో సర్ ఫారాలు నింపడానికి ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు

- ఒకే రోజులో 30శాతం ఫారాలు నమోదు..... 100శాతం పూర్తి నమోదు అవుతుందని హామీ.....
- పట్టుదలతో పనులు చేస్తే పరిస్కారం అవుతుంది......
- సర్పంచ్ డోంగ్రె సంతోష్ఆధ్వర్యంలో,.....
- ప్రజల ప్రశంసలు అందుకుంటున్న సర్పంచ్ డోంగ్రె సంతోష్ సేవాభావం!.......



కొమరంబీమ్ ఆసిఫాబాద్ :జులై 07 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని డబ్బా గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా సర్పంచుల ఫోరం సంఘం అధ్యక్షుడు డబ్బా గ్రామ సర్పంచ్ డోంగ్రె సంతోష్ ఆధ్వర్యములో గ్రామపం చా యతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్ (స్పెషల్ ఇంటెన్సవ్ రెవిషన్ ) సమగ్ర ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఫారాలను ఉచితంగా నింపడానికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు,ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది...చదువు రాని నిరక్షరాస్యులు, వృద్ధులు, స్వయంగా ఫారాలు నింపలేని వారు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సర్పంచ్ సంతోష్ సొంత ఖర్చుతో నలుగురు యువకులను సిబ్బందిని నియమించి, ప్రతి ఒక్కరి వివరాలను తప్పులు లేకుండా సక్రమంగా నమోదు చేయించి సర్ ఫారా లను పూర్తి చేయించి సంబంధిత బీఎల్‌ఓలకు అందజేశారు.ఈ ప్రత్యేక చొరవతో ఒకే రోజులో గ్రామంలో సుమారు 30 శాతం సర్ ఫారాల నమోదు పూర్తికావడం విశేషం. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉంటే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ కార్యక్రమం నిదర్శనంగా స్పష్టంగా నిరూపించింది.ఈ సందర్భంగా సర్పంచ్ డోంగ్రె సంతోష్ మాట్లాడుతూ, డబ్బా గ్రామంలో సర్ ఫారాల నమోదును 100 శాతం పూర్తి చేయడమే లక్ష్యమని,అర్హులైన ప్రతీ ఓటరు తప్పనిసరిగా ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా పూర్తి సహకారం అందిస్తూ సర్ ఫారాలను 100% పూర్తి చేసేందుకు తమ వంతు బాధ్యతగా సహకరిస్తామని తెలి పారు.ప్రజాసేవకు అంకితభావం... గ్రామాభివృద్ధికి నిబద్ధత... ప్రతి ఓటరికి న్యాయం చేయాలనే సంకల్పం... ఇదే డబ్బా గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రత్యేకత."100% సర్ -- 100% బాధ్యత -- 100% ప్రజల సహకారం" అనే లక్ష్యంతో డబ్బా గ్రామం ముందుకు సాగుతోంది.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ జాఫర్, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణ యాదవ్,బిఎల్‌ఏలు గాజనబోయిన రాజేంద్ర,దుష్ట నిర్మల,పులి పుష్పలీల విఓఏలు అద్దాల మల్లయ్య,ఆత్మకూరి జీవిత, వాలింటర్లు జుమిడి నవీన్, దుర్గం అనీల్,దాగం దీపక్, దుష్ట సంతోష్ గ్రామస్తులు ఓటర్లు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

# యాంగ్జైటీ అంటే ఏమిటి.. దీనికి కారణాలేంటి.. ఏం చేయాలి..?



ఆందోళన (యాంగ్జైటీ) కేవలం మనసుకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, అది శరీరంలోని అనేక భాగాలపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం, కండరాలు బిగుసుకుపోవడం, తలనొప్పి, కడుపు అసౌకర్యం వంటి లక్షణాలు కూడా యాంగ్జైటీ సంకేతాలే అని వారు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి కారణంగా ఈ సమస్య మరింత సాధారణంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు. నిపుణుల ప్రకారం, యాంగ్జైటీ అంటే ఏదో ప్రమాదం ఉందని శరీరం లేదా మనసు భావించే పరిస్థితి. ఈ ప్రమాదం బయట నుంచి రావచ్చు లేదా శరీర సామర్థ్యాలు, పరిస్థితులపై ఏర్పడే భయం వల్ల కూడా రావచ్చు. అలాంటి సమయంలో శరీరం రక్షణ చర్యలకు సిద్ధమవుతూ అనేక శారీరక మార్పులను ప్రదర్శిస్తుంది. యాంగ్జైటీ ప్రభావం ముందుగా గుండె, ఛాతీ భాగంలో కనిపిస్తుంది. గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీలో బిగుతుగా అనిపించడం, శ్వాస వేగంగా మారడం, కొన్నిసార్లు తల తిరిగినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి శరీరం అప్రమత్త స్థితిలోకి వెళ్లిన సంకేతాలని నిపుణులు వివరిస్తున్నారు.జీర్ణ వ్యవస్థపై ప్రభావం..యాంగ్జైటీ వల్ల జీర్ణవ్యవస్థ కూడా ప్రభావితమవుతుంది. ఒత్తిడి సమయంలో శరీరం రక్తప్రసరణలో ఎక్కువ భాగాన్ని కండరాల వైపు మళ్లించి, ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతుంది. దీంతో జీర్ణవ్యవస్థ పనితీరు తాత్కాలికంగా మందగించి వికారం, కడుపు ఉబ్బరం, అజీర్ణం, తరచుగా మలవిసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో కండరాలు కూడా ఎక్కువ ఒత్తిడికి గురవుతాయి. శరీరం ఎప్పుడైనా స్పందించాల్సిన పరిస్థితి వస్తుందనే అప్రమత్తతతో కండరాలు బిగుసుకుపోతాయి. ఫలితంగా మెడ నొప్పి, భుజాలు బిగుసుకుపోవడం, వెన్ను నొప్పి, శరీరంలో బిగుతుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.నిర్లక్ష్యం చేయవద్దు..ఈ శారీరక మార్పులన్నీ వాస్తవానికి శరీరం తనను తాను రక్షించుకునేందుకు చేసే సహజ ప్రతిస్పందనలో భాగమేనని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ లక్షణాలు తరచూ కనిపించినా చాలామంది వాటిని సాధారణ నొప్పులు లేదా అలసటగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారని వారు అంటున్నారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాసలో ఇబ్బంది, మెడ లేదా వెన్ను నొప్పి, జీర్ణ సమస్యలు వంటి లక్షణాలు తరచూ కనిపిస్తూ రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తుంటే వాటి వెనుక యాంగ్జైటీ కూడా ఒక కారణంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైతే వైద్యులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించి సరైన సలహా, చికిత్స పొందడం మంచిదని వారు పేర్కొంటున్నారు.

# రేరాకు సమాచార కమిషన్ షాక్ ... 14 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సిందే !




ఆంధ్ర ప్రదేశ్ : జూలై 7 :ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రేరా)లో సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం అమలు, రేరా నిబంధనల ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు, ఫిర్యాదులు, బాధితులకు మంజూరైన పరిహారాలు, తీర్పుల కాపీలు తదితర వివరాలను ఆర్టీఐ దరఖాస్తుదారు కాంద్రేగుల వెంకటరమణకు 14 రోజుల్లోగా అందజేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్ వి.శరత్‌చంద్ర కళ్యాణ చక్రవర్తి ఆదేశించారు. సకాలంలో సమాచారం ఇవ్వ కుండా పొంతనలేని సమాధానాలు ఇచ్చిన రేరా అధికారుల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్చువల్ విధానంలో మంగళవారం నిర్వహించిన ఆర్టీఐ అప్పీల్ నెం. 9537/2024 విచారణలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ... ఆర్టీఐ చట్టం–2005 సెక్షన్ 4 (1) (బి), సిటిజన్ ఛార్టర్. ఆర్టీఐ చట్టం సెక్షన్ 5 (1), (2), సెక్షన్ 19 (1)లను అనుసరించి పీఐవో, ఏపీఐవో, అపీ? పలేట్ అథారిటీ వివరాలు, రేరా నిబంధనలు ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు, నివేదికలు. ఫిర్యాదులు, బాధితులకు మంజూరు చేయించిన క్లెయిమ్‌లు, తీర్పులు, రేరా అవగాహన, ప్రచార కార్యక్రమాల నివేదికలు, ప్రగతి నివేదికలు, పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాల కాపీలు, ఆర్టీఐ చట్టం అమలుకు సంబంధించి మొత్తం 22 అంశాలపై సమాచారం కోరుతూ రేరా ప్రధాన కార్యాలయానికి ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాంద్రేగుల వెంకటరమణ 2023 నవంబర్ 11న దరఖాస్తు చేశారు. అయితే ఆర్టీఐ సెక్షన్ 6 (1), 19 (1) దరఖాస్తులకు అధికారులు పూర్తి స్థాయిలో స్పందించ లేదు. దీంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆర్టీఐ ఉద్యమకర్త, దరఖాస్తుదారు కాంద్రేగుల వెంకటరమణ ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో జరిగిన అప్పీలు విచారణ సందర్భంగా పారదర్శకత, జవాబు దారీ తనం కోసం ఆర్టీఐ చట్టం, రేరా నిబంధనలు అమలులో రేరా అధికార యంత్రాంగం అలసత్వం చూపుతోందని, సమాచారం ఉద్దేశపూర్వకంగా ఇవ్వలేదని ... పారదర్శకత, అధికార దుర్వినియోగం నియంత్రణ కోసం కోరిన సమాచారాన్ని ఇప్పించాలని, అదేవిధంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహించిన బాధ్యులకు జరిమానాలు విధించాలని కాంద్రేగుల వెంకటరమణ వాదనలు వినిపించారు. దీనికి రేరా అధికార యంత్రాంగం పరస్పర విరుద్ధమైన సమాధానాలు ఇవ్వడంతో సమాచార కమిషనర్ వి.శరత్‌చంద్ర కళ్యాణ చక్రవర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని 14 రోజుల్లోగా అందజేయాలని ఆదేశించారు.

# సాలూరు ఐటిఐ కాలేజీలో మొదటి విడత ప్రవేశాలకు కౌన్సిలింగ్

పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు, జూలై 7, పార్వతీపురం మన్యం జిల్లాలో గల 03 ప్రభుత్వ, 04 ప్రైవేట్ ఐటిఐ కళాశాలలో మొదటి విడత ప్రవేశాలకు కౌన్సిలింగ్ జూలై 11 నుండి జూలై 15వ తేదీ వరకు జరుగుతాయని, మొత్తం 708 మంది ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకున్నారని అర్హులైన వారందరికీ మొబైల్ కు ఎస్ఎంఎస్ ద్వారా సందేశం అందుతుందని, మెసేజ్ రానివారు వారి యొక్క జిపిఏ ద్వారా కౌన్సిలింగ్ కు హాజరుకావాలని, అభ్యర్థులు వారి యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో సాలూరు ఐటిఐ కాలేజీలో హాజరు కావాలని ప్రిన్సిపల్ జిల్లా కన్వీనర్ డి శ్రీనివాసాచారి తెలిపారు.1 వ ర్యాంక్ నుండి 69వ ర్యాంక్ ,10.0 నుండి 8.8 ఎస్.ఎస్.సి గ్రేడ్ వారు 11 వ తేదీ ఉదయం 9 గంటలకు,70 నుండి 162 ర్యాంక్ వారు 8.7 నుండి 8.2 గ్రేడ్ వారు మధ్యాహ్నం 1 గంటలకు,జూలై 12 న ఉదయం 9 గంటలకు 163 నుండి 280 ర్యాంక్ వారు,8.1 నుండి 7.5 గ్రేడ్ వారు, మధ్యాహ్నం 1 గంటల కు 281 నుండి 361 ర్యాంక్,7.4 నుండి 7.0 గ్రేడ్,జూలై 13 న ఉదయం 9 గంటల 362 నుండి 444 ర్యాంక్,6.9 నుండి 6.5 గ్రేడ్ వరకు, మధ్యాహ్నం 1 నుండి 445 నుండి 529 ర్యాంక్ వరకు 6.4 నుండి 5.8 గ్రేడ్ వరకు,జూలై 14 న ఉదయం 9 గంటలకు 530 నుండి 611ర్యాంక్ వరకు,5.7 నుండి 5.0 గ్రేడ్ వరకు, మధ్యాహ్నం 1 గంటలకు 612 నుండి 708 ర్యాంక్ వరకు,4.9 నుండి 3.2 గ్రేడ్ వరకు జూలై 15 జనరల్, గర్ల్స్, ఈ.డబల్యూ.ఎస్ ఇంకా ఇతరులు 01 నుండి 708 ర్యాంక్ వరకు ఉంటుంది.మరిన్ని వివరాలకు 90525 08903 ,94413 6794 3,949 349 9587 నెంబర్లను సంప్రదించగలరు.



# పాలమూరుపై కరీంనగర్ విజయం

కరీంనగర్ డైమండ్స్ తెలంగాణ టీ20 (టీజీ20) లీగ్-2026 తొలి సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. తప్పక గెలవాల్సిన కీలక మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్‌పై 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టాప్-4లో తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన కరీంనగర్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. టాస్ గెలిచిన పాలమూరు స్ట్రైకర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన కరీంనగర్ డైమండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టు కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ మరోసారి అసాధారణ ఇన్నింగ్స్ ఆడి జట్టుకు భారీ స్కోరు అందించాడు. కేవలం 58 బంతుల్లో 11 ఫోర్లు, ఆరు సిక్సర్లతో 109 పరుగులు చేసి ఈ సీజన్‌లో తన రెండో శతకాన్ని నమోదు చేశాడు. తన్మయ్‌కు ఓపెనర్ సాత్విక్ రెడ్డి మంచి సహకారం అందించాడు. 22 బంతుల్లో 32 పరుగులు చేసి జట్టుకు వేగవంతమైన ఆరంభం ఇచ్చాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో నిశాంత్ రెడ్డి బౌలింగ్‌లో వరుసగా ఐదు ఫోర్లు బాదడం విశేషం. అనంతరం చందన్ సహాని 16 పరుగులు, హెచ్‌కే సింహ 15 పరుగులు, రాహుల్ రాదేశ్ 10 పరుగులు చేశారు. చివర్లో నారాయణ తేజ ఎనిమిది బంతుల్లోనే 23 పరుగులతో మెరుపులు మెరిపించి స్కోరును 216కు చేర్చాడు. పాలమూరు బౌలర్లలో అశ్వద్ రాజీవ్ రెండు వికెట్లు పడగొట్టగా, రిషభ్ బిస్లాస్, మహ్మద్ అఫ్రిది, నిశాంత్ రెడ్డి తలో వికెట్



సాధించారు. 217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాలమూరు స్ట్రైకర్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. కరీంనగర్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమవడంతో పాలమూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 143 పరుగులకే పరిమితమైంది. ఒకవైపు వికెట్లు పడుతున్నా సంహిత్ రెడ్డి మాత్రం చివరి వరకు పోరాడాడు. అతడు అజేయంగా 67 పరుగులు చేసినా జట్టును విజయానికి చేర్చలేకపోయాడు. మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో పాలమూరు భారీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. కరీంనగర్ బౌలింగ్‌లో రత్లావత్ దినేశ్, శుభం శర్మ చెరో మూడు వికెట్లు తీసి పాలమూరు బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. నారాయణ తేజ, ఆశిష్ శ్రీవాస్తవ్ తలో వికెట్ సాధించి విజయాన్ని మరింత సులభం చేశారు. ఈ విజయంతో కరీంనగర్ డైమండ్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. లీగ్ దశలో చివరి మ్యాచ్‌ను విజయంతో ముగించిన జట్టు నాకౌట్ పోరుకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవుతోంది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ అద్భుత ఫామ్, బౌలర్ల సమష్టి ప్రదర్శన కరీంనగర్‌కు ప్రధాన బలంగా మారాయి. ఇప్పటికే హైదరాబాద్ ఈ-చాంపియన్స్ ఏడింట ఏడూ విజయాలతో 14 పాయింట్లు సాధించి పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకుంది. ఖమ్మం ఏసెస్ కూడా ఐదు విజయాలతో నాకౌట్ దశకు చేరింది. కరీంనగర్ విజయంతో మరో ప్లే ఆఫ్స్ స్థానం ఖరారవగా, చివరి బెర్తు కోసం మిగిలిన జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో సమష్టిగా రాణించిన కరీంనగర్ డైమండ్స్, తొలి టీజీ20 సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించి టైటిల్ రేసులో బలమైన పోటీదారుగా నిలిచింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ శతకం, బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

# సంజు శాంసన్‌ను పక్కన పెట్టేసిన సెలెక్టర్లు

**• మళ్లీ అదే తప్పు చేస్తున్నారని మహ్మద్ కైఫ్ ఆగ్రహం**



టీ20 ప్రపంచ కప్ తర్వాత భారత జట్టు వరుస వైఫల్యాలతో గెలుపు రుచి చూడలేకపోతోంది. ఐర్లాండ్‌తో సిరీస్ ఓటమి, ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్ రద్దు కాగా, రెండో టీ20లోనూ టీమిండియా 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ క్రమంలో, ఐర్లాండ్ పర్యటన నుంచి పేలవ ప్రదర్శన కనబరుస్తున్న స్టార్ ఓపెనర్ సంజు శాంసన్‌ను రెండో టీ20తో పాటు త్వరలో జరగబోయే జింబాబ్వే పర్యటన నుంచి కూడా తప్పించడం అభిమానుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. శాంసన్ స్థానంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి జట్టులో అవకాశం కల్పించారు. సంజు శాంసన్ తొలగింపుపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ స్పందిస్తూ సెలెక్టర్ల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత టీ20 ప్రపంచ కప్‌లో చేసిన తప్పునే మేనేజ్‌మెంట్ మళ్లీ పునరావృతం చేస్తోందని విమర్శించాడు. టాపార్డర్‌లో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఇద్దరూ ఎడమచేతి వాటం బ్యాటర్లే కావడం వల్ల ప్రత్యర్థులు ఆఫ్ స్పిన్నర్లను దించి వికెట్లు తీసే ప్రమాదం ఉందన్నాడు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా టాపార్డర్‌లో తప్పనిసరిగా రైట్, లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ ఉండాలని, శాంసన్ వంటి అనుభవజ్ఞుడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని కైఫ్ అభిప్రాయపడ్డాడు. ఇదిలా ఉండగా, ఇప్పటికే ఇంగ్లండ్ 1-0 ఆధిక్యంలో ఉన్న నేపథ్యంలో, నేడు నాటింగ్‌హామ్ వేదికగా జరగనున్న మూడో టీ20లో విజయం సాధించి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని టీమిండియా పట్టుదలతో ఉంది. అరంగేట్రం మ్యాచ్‌లో 14 పరుగులకే ఔటైన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఈ కీలక మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# మూడు ఓటములకే ఇంతలా విమర్శలా..?

**- టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్**


టీ20 ఫార్మాట్‌లో వరల్డ్ ఛాంపియన్ టీమిండియా వరుస పరాజయాలను ఎదుర్కొంటుంది. ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన భారత్.. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ శుభారంభం అందుకోలేకపోయింది. వర్షంతో తొలి మ్యాచ్ రద్దవ్వగా.. రెండో టీ20లో ఓటమిపాలైంది. దాంతో భారత జట్టుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మంగళవారం నాటింగ్‌హామ్ వేదికగా మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్.. విమర్శలను తప్పుబట్టాడు. కేవలం మూడు పరాజయాలకే ఇంతాలా విమర్శలు చేయడం సరికాదన్నాడు. ప్రస్తుతం భారత జట్టు ట్రాన్సిషన్ ఫేస్‌లో ఉందని, కొత్త కెప్టెన్, యువ ఆటగాళ్లు



జట్టులోకి వచ్చారని తెలిపాడు. 'గత రెండేళ్లుగా భారత్ టీ20 జట్టు అద్భుతమైన ప్రదర్శన చేసింది. ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు. ఆసియా కప్, ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మకపై టోర్నీల్లో విజేతగా నిలిచింది. ఆ విజయాలు సాధించినప్పుడు ఆకాశానికెత్తిన వారే.. ఇప్పుడు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోగానే విమర్శలు చేస్తున్నారు. ఇది సరికాదు. ఆటలో గెలుపోటములు సహజం. భారత జట్టు ప్రస్తుతం పరివర్తనా దశలో ఉంది. జట్టు పునర్నిర్మాణం జరుగుతుంది. జట్టుకు కొత్త కెప్టెన్ వచ్చాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టుకు దూరంగా ఉన్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2028 టోర్నీని దృష్టిలో ఉంచుకుని జట్టును నిర్మిస్తున్నాం. ఈ క్రమంలోనే యువ ఆటగాళ్లకు వరుస అవకాశాలు కల్పిస్తున్నాం. ఇలాంటి మార్పుల సమయంలో కొన్ని ఓటములు ఎదురవ్వడం సహజం. హార్దిక్ పాండ్యాకు బ్యాకప్‌గా ఆటగాళ్లను సిద్ధం చేస్తున్నాం. టీ20ల్లో పేస్ ఆల్‌రౌండర్‌ను ఆరో బౌలర్‌గా పరిగణిస్తే వారు కీలక పాత్ర పోషిస్తారు. ఎక్కువ మంది యువ ఆటగాళ్లు ఉన్నప్పుడు 15 మందికి ఆడే అవకాశం దక్కకపోవచ్చు. కనీసం జట్టుతో పాటు ఉండటం వల్ల వారు ఆ వాతావరణానికి అలవాటు పడుతారు.'అని సితాన్షు కోటక్ చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా 1-0తో వెనుకంజలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దవ్వగా.. రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిచింది. ఈ సిరీస్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు కీలకం.

# ఫిఫా ప్రపంచ కప్ 2026లో ముగిసిన పోర్చుగల్ కథ

**• ప్రీ క్వార్టర్స్‌లో 1-0తో పోర్చుగల్ పై స్పెయిన్ గెలుపు**



అమెరికా వేదికగా జరుగుతున్న ఫిఫా ప్రపంచ కప్ 2026లో పోర్చుగల్ కథ ముగిసింది. ఫుట్‌బాల్ దిగ్గజంగా పేరు పొందిన క్రిస్టియానో రొనాల్డో తన చివరి ప్రపంచ కప్ మ్యాచ్‌ను ఓటమితో ముగించాడు. స్పెయిన్‌తో జరిగిన ప్రీ క్వార్టర్ మ్యాచులో పోర్చుగల్.. 1-0 తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో స్పెయిన్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. పోర్చుగల్ మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక 2 దశాబ్దాలకు పైగా తన ఆటతో మంత్రముగ్ధులను చేసిన రొనాల్డో.. తన చివరి మ్యాచ్ ముగిసిన తర్వాత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టాడు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో.. 2006లో తొలిసారి ఫిఫా వరల్డ్ కప్ ఆడాడు. ఇక ఫిఫా ప్రపంచకప్ 2026 తనకు చివరి టోర్నీ అని రొనాల్డో ఇది వరకే ప్రకటించాడు. కానీ తన జట్టును మరోసారి క్వార్టర్ ఫైనల్‌కు తీసుకెళ్లాలన్న అతడి ఆశలు నెరవేరలేదు. స్పెయిన్ మికెల్ మెరినో చేసిన ఏకైక గోల్ .. స్పెయిన్ విజయాన్ని, పోర్చుగల్ నిష్క్రమణను ఖాయం చేసింది. కాగా స్పెయిన్.. 2010లో ఫిఫా ప్రపంచకప్ టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత ఒక్కసారి కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోలేదు. కానీ 16 ఏళ్ల తర్వాత మళ్లీ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. స్పెయిన్ క్వార్టర్ ఫైనల్‌లో బెల్జియంతో తలపడే అవకాశం ఉంది. మరోవైపు ఈ మ్యాచ్‌తో స్పెయిన్ వరుసగా ఆరు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులకు గోల్ చేసే అవకాశమే ఇవ్వకుండా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇటలీ (1990), స్విట్జర్లాండ్ (2006-10) పేరిట ఉన్న ఐదు వరుస క్లీన్ షీట్‌ల రికార్డును ఆ జట్టు అధిగమించింది. గోల్ కీపర్ ఉనై సిమోన్ వ్యక్తిగతంగానూ అరుదైన ఘనత సాధించాడు. వరుసగా 609 నిమిషాల పాటు గోల్ ఇవ్వకుండా నిలిచి ప్రపంచ కప్ చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో ఇటలీ దిగ్గజ గోల్ కీపర్ వాల్టర్ జెంగా పేరిట ఉన్న 517 నిమిషాల రికార్డును అతడు బ్రేక్ చేశాడు. ఇక 41 ఏళ్ల రొనాల్డో.. అరుదైన రికార్డు సాధించాడు. ఆరు ప్రపంచకప్‌లు ఆడిన ఇతడు.. అన్నింట్లోనూ గోల్ చేసిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. తాజా టోర్నీలో అతడు మూడు గోల్స్ చేశాడు. ఆరు సార్లు ప్రపంచకప్ ఆడినా.. రొనాల్డో మాత్రం ట్రోఫీ అందుకోలేకపోయాడు. తన డెబ్యూ ప్రపంచకప్ అయిన 2006లో రొనాల్డో జట్టు సెమీస్ వరకూ చేరింది. ఇదే అతడి కెరీర్‌లో బెస్ట్. మొత్తంగా ప్రపంచకప్‌లో అతడు 27 మ్యాచులలో 11 గోల్స్ చేశాడు.

# టీమిండియా హెడ్‌కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్..!

**- జింబాబ్వే టూర్‌కు హెడ్‌కోచ్ మార్పు**

టీమిండియా టీ20 జట్టు త్వరలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడ మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఇందుకోసం భారత సెలక్షన్ కమిటీ.. 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. అయితే ఈ టీమ్‌తో పాటు వెళ్లే కోచింగ్ స్టాఫ్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. జింబాబ్వే పర్యటనకు ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెళ్లడం లేదట. గంభీర్ స్థానంలో టీమిండియా మాజీ క్రికెటర్, ప్రస్తుతం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' చీఫ్‌గా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు వహించనున్నాడని సమాచారం. భారత క్రికెట్ జట్టు రాబోయే రోజుల్లో వరుస అంతర్జాతీయ సిరీస్‌లతో బిజీగా ఉండనుంది. ముఖ్యంగా వన్డే ప్రపంచకప్ 2027కు సన్నద్ధం అవడంలో భాగంగా.. ప్రణాళికలు రచిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో గంభీర్‌కు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. అతడితో పాటు ఇతర కోచింగ్ సిబ్బంది కూడా జింబాబ్వే పర్యటనకు వెళ్లరని సమాచారం. ప్రస్తుతం టీమిండియా ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. టీ20 సిరీస్ ఆడుతోంది. ఇది పూర్తయిన తర్వాత వన్డే సిరీస్ ఉంటుంది. ఈ నేపథ్యంలో గంభీర్‌కు విశ్రాంతినిస్తూ, పనిభారాన్ని తగ్గించేందుకు గానూ ఈ పర్యటన బాధ్యతలను లక్ష్మణ్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. జింబాబ్వే పర్యటనతో పాటు ఈ ఏడాది సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్ 2026లో కూడా భారత జట్టుకు వీవీఎస్ లక్ష్మణ్ హెడ్‌కోచ్‌గా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే ఏషియన్ గేమ్స్ సమయంలో భారత సీనియర్ జట్టు వెస్టిండీస్‌లో పర్యటిస్తుంది. రెండు సిరీస్‌లు ఒకేసారి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జులై 23, 25, 26 తేదీల్లో భారత్, జింబాబ్వే మధ్య మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు ఇదే..శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)

# భారత్‌తో వన్డే సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టు ప్రకటన


ఈ నెలలో భారత్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్ తమ జట్టును ప్రకటించింది. 16 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో ఓ కొత్త ఆటగాడికి తొలిసారిగా అవకాశం కల్పించారు. ససెక్స్ యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్‌ను ఈ సిరీస్ కు ఎంపిక చేశారు. టెస్టుల్లో రాణించిన ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్‌కు కూడా తొలిసారిగా వన్డే జట్టు నుంచి పిలుపు అందింది. మరోవైపు, స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి 50 ఓవర్ల జట్టులోకి రావడం ఇంగ్లండ్‌కు బలాన్నిచ్చింది. 2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇంగ్లండ్ జట్టును ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన జేమ్స్ కోల్స్‌ను దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తుండటంతో జట్టులోకి తీసుకున్నారు. అతనితో పాటు లియామ్ డాసన్‌ను కూడా ఎంపిక చేయడం ద్వారా స్పిన్ బౌలింగ్ వనరులను పటిష్టం చేసుకోవాలని ఇంగ్లండ్ భావిస్తోంది. టెస్టుల్లో మంచి ప్రదర్శన కనబర్చినందుకు జోష్ టంగ్‌కు వన్డేల్లో అవకాశం దక్కింది. గాయాల నుంచి కోలుకున్న గస్ అట్కిన్‌సన్, సాకిబ్ మహమూద్ కూడా తిరిగి జట్టులో చేరారు. గాయాల కారణంగా బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న ఈ జట్టులో జోస్ బట్లర్, జో రూట్, బెన్ డకెట్ వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు ఉన్నారు. మరోవైపు, ఈ సిరీస్ కోసం భారత్ పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఆటగాళ్లు ఆడనున్నారు. జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుండగా, 16న కార్డిఫ్, 19న లార్డ్స్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరుగుతాయి.ఇంగ్లండ్ వన్డే జట్టు:హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జో రూట్, విల్ జాక్స్, బెన్ డకెట్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, శామ్ కరన్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్‌సన్, టామ్ బాంటన్, జేమ్స్ కోల్స్, లియామ్



డాసన్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

## రాజకీయాల్లోకి ధనుష్? ..

### జెండా ఆవిష్కరించిన అభిమానులు!



తమిళనాడు రాజకీయాల్లో కోలీవుడ్ దళపతి విజయ్ సృష్టించిన సంచలన విజయం... ఇప్పుడు ద్రవిడ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలిసారే ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించి, విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. కమల్ హాసన్ వంటి మహామహులకే సాధ్యం కాని ఈ రాజకీయ అద్భుతాన్ని విజయ్ సాకారం చేయడంతో, ఇప్పుడు కోలీవుడ్‌లోని మరికొందరు స్టార్స్ అటువైపు అడుగులు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.ఈ క్రమంలోనే కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కూడా త్వరలోనే రాజకీయ అరంగేట్రం చేయబోతున్నారనే ప్రచారం తమిళనాట జోరుగా సాగుతోంది. తాజాగా ధనుష్ అభిమాన సంఘం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఒక అధికారిక జెండాను ఆవిష్కరించడం హాట్ టాపిక్‌గా మారింది. కేవలం జెండా రూపకల్పనకే పరిమితం కాకుండా, తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని అభిమాన సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. ఇది పక్కా పొలిటికల్ స్కెచ్‌తోనే జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.ముఖ్యమంత్రి విజయ్ బాటలోనే ధనుష్ కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయానికి పూర్తి ప్రణాళికతో పక్కాగా బరిలోకి దిగుతారని కోలీవుడ్ వర్గాల్లో గట్టి చర్చ నడుస్తోంది. మరోవైపు, తన పొలిటికల్ ఎంట్రీపై సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో ఇంత పెద్ద ఎత్తున ఊహాగానాలు వస్తున్నప్పటికీ... హీరో ధనుష్ వైపు నుంచి గానీ, ఆయన పీఆర్ టీమ్ నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడం గమనార్హం.



## నా అండాలు దాచుకున్నా : నటి కృతి సనన్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక కీలకమైన, స్ఫూర్తిదాయకమైన విషయాన్ని వెల్లడించారు. కెరీర్‌లో 'మిమి', 'క్రూ', 'బరేలీ కి బర్ఫీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దూసుకుపోతున్న ఆమె.. పెళ్లి, పిల్లల విషయంలో మహిళలు ఎదుర్కొనే సామాజిక, వయసు సంబంధిత ఒత్తిడిని అధిగమించేందుకు తాను కొన్ని సంవత్సరాల క్రితమే తన అండాలను ఫ్రీజ్ (జుస్త్రస్త్ర ఖీతీవవఓఅఅస్త్రు) చేయించుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా తన జీవితాన్ని తనకు నచ్చినట్లుగా, ఎలాంటి టైమ్‌లైన్ ఒత్తిడి లేకుండా జీవించే స్వేచ్ఛను పొందానని ఆమె పేర్కొన్నారు.ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' వ్యవస్థాపకురాలు కరిష్మా మెహతాతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో కృతి ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మహిళలు ఎదుర్కొనే 'బయోలాజికల్ క్లాక్' సమస్య గురించి హోస్ట్ ప్రశ్నించగా, కృతి స్పందిస్తూ.. "నిజాయతీగా చెప్పాలంటే, నేను నా అండాలను ఫ్రీజ్ చేయించుకున్నాను. పెళ్లి ఇప్పుడే చేసుకోవాలి, పిల్లల్ని ఇప్పుడే కనాలి అనే ఒత్తిడికి నేను లోనవ్వాలని అనుకోలేదు. వివాహం అయినా, పిల్లలైనా సరే.. మనసులోంచి రావాలి కానీ, ఎవరో చెప్పారని, వయసు అయిపోతోందని కాదు" అని ఆమె స్పష్టం చేశారు. ఈ సదుపాయం అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చని, కానీ తాను ఆ ఖర్చు భరించగలిగినందుకు అదృష్టవంతురాలినని ఆమె అన్నారు.ఈ ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేశారనే విషయాన్ని కూడా కృతి వివరించారు. జాతీయ అవార్డు సాధించిపెట్టిన 'మిమి' సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరగాల్సి వచ్చింది. ఆ సమయంలోనే తాను ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "ఆ సినిమా కోసం బరువు పెరగడానికి నాకు రెండు నెలల సమయం దొరికింది. షూటింగ్ లేదు. అప్పుడే ఈ ప్రక్రియ గురించి ఒకరు నాకు సలహా ఇచ్చారు. ఇది మహిళలు తమకు తాము ఇచ్చుకునే ఉత్తమ బహుమతి అని చెప్పారు. పైగా 'మిమి' సినిమా సరోగసీ నేపథ్యంతో కూడుకున్నది కావడంతో, ఆ సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం సరైనదనిపించింది" అని కృతి గుర్తుచేసుకున్నారు.

## వేగం అందుకున్న వెంకీ-అనిల్ సినిమా..

### సెట్స్‌లోకి వెంకటేశ్

వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కలిసి నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ వేగం అందుకుంది. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కీలక షెడ్యూల్ ప్రారంభమైంది. దీంట్లో పాల్గొనేందుకు వెంకటేశ్ తాజాగా సెట్స్‌లో అడుగుపెట్టారు.

ప్రస్తుతం ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ ఎపిసోడ్లలో వెంకటేశ్‌తో పాటు నందమూరి కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. ఇటీవల కల్యాణ్‌రామ్ పుట్టినరోజును చిత్రబృందం సెట్స్‌లోనే జరుపుకొంది. అదే సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, 2027 సంక్రాంతికి సినిమా విడుదల కానుందని ప్రకటించింది.

ఇటీవల ఈ సినిమా పేరుతో నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో నిర్మాతలు హెచ్చరిక జారీ చేశారు. అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వచ్చే ప్రకటనలను మాత్రమే నమ్మాలని, వ్యక్తిగత వివరాలు లేదా డబ్బు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని స్పష్టం చేశారు.

కొద్ది రోజుల క్రితమే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



వెంకటేశ్‌తో అనిల్ రావిపూడికి ఇది ఐదో సినిమా. ఇప్పటికే 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి విజయాల తర్వాత మరోసారి ఇద్దరూ చేతులు కలిపారు. కల్యాణ్‌రామ్‌తో అనిల్‌కు ఇది రెండో చిత్రం. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'పటాస్' మంచి విజయం సాధించింది.

ఈ చిత్రాన్ని అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే కుటుంబ వినోద కథగా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. హాస్యం, భావోద్వేగాలు, వినోదానికి సమాన ప్రాధాన్యం ఉండేలా అనిల్ రావిపూడి తన శైలిలో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

## ముఖాలు మారినా పద్ధతులు మారలేదు

### : 'అమ్మ'కు రేవతి, పద్మప్రియ రాజీనామా!



మలయాళ సినీ తారల సంఘం 'అమ్మ'లో సంక్షోభం మరింత ముదిరింది. జస్టిస్ హేమా కమిటీ నివేదిక వెలువడిన తర్వాత చెలరేగిన వివాదాల నేపథ్యంలో అప్పటి అధ్యక్షుడు మోహన్‌లాల్, ఆయన కార్యవర్గం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 'అమ్మ'కు తొలి మహిళా అధ్యక్షురాలిగా రికార్డు సృష్టిస్తూ నటి శ్వేతా మీనన్ బాధ్యతలు చేపట్టారు. అయితే, తాజాగా జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమె కమిటీపై కూడా పలు ఆరోపణలు రావడంతో శ్వేతా మీనన్‌తో పాటు మొత్తం కార్యవర్గం మూకుమ్మడిగా రాజీనామా చేసింది. ఈ తీవ్ర అనిశ్చితి మధ్య, పరిశ్రమలోని సీనియర్ నటీమణులు రేవతి, పద్మప్రియ సైతం 'అమ్మ' ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం మలయాళ చిత్రసీమలో సంచలనంగా మారింది.పని ప్రదేశాల్లో మహిళల భద్రత, సమాన వేతనాల కోసం పోరాడుతున్న 'విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్' (ఔజజ) వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న రేవతి, పద్మప్రియ ఈ నిర్ణయంపై ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సంస్థలో అధికారం చేతులు మారినప్పటికీ ప్రాధాన్యతలు మారలేదని, 'అమ్మ'లో ఇంకా పితృస్వామ్య ధోరణులు, అధికార రాజకీయాల ప్రభావం కొనసాగుతూనే ఉందని వారు ఆరోపించారు. తాము ఎన్నో దశాబ్దాలుగా ఈ రంగానికి సేవ చేశామని, భవిష్యత్తు మెరుగ్గా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మలయాళ సినిమా ఎప్పటికీ తమదేనని, దాని కోసం పనిచేయడానికి ఎలాంటి సంస్థ సభ్యత్వాలు అవసరం లేదని వారు కుండబద్దలు కొట్టారు.

## హీరోల తప్పులను ఎత్తి చూపడం చాలా కష్టం



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, హీరోయిన్ పార్వతి తిరువోతు జంటగా నటించిన లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ఐనోబడీ'. నిస్సాం బషీర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ బ్యాంక్ ఉద్యోగి రాజీవన్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మలయాళంలో ఈ నెల 9న, తెలుగులో 10న థియేటర్లలో విడుదల కాబోతోంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నటి పార్వతి మలయాళ చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులపై, హీరోల చుట్టూ అలుముకున్న కల్చర్‌పై చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

గడిచిన ఎనిమిది, తొమ్మిదేళ్లలో మలయాళ సినీ పరిశ్రమలో కొన్ని మార్పులు వచ్చిన మాట వాస్తవమే అయినా... అవన్నీ మనస్ఫూర్తిగా వచ్చినవి కావని పార్వతి కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల నుంచి వచ్చిన విమర్శలు, మీడియా నిరంతరం చూపించిన శ్రద్ధ వల్లే ఇండస్ట్రీలో ఆ మార్పులు జరిగాయని ఆమె అభిప్రాయపడ్డారు. మలయాళ చిత్రసీమలో స్టార్ హీరోలను పూజించే సంస్కృతి అలాగే కొనసాగుతోందని, ఇక్కడి సూపర్‌స్టార్లను దేవుళ్లలా పూజించడం వల్లే వారి తప్పులను ఎత్తిచూపడం ఎవరికైనా చాలా కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితులు ఉండటం వల్లే ఇండస్ట్రీలో బాగా పలుకుబడి ఉన్న వ్యక్తులు, కొత్తగా వచ్చే వారిపై తమ అధికారాన్ని చాలా సులభంగా చెలాయిస్తున్నారని ఆమె మండిపడ్డారు. పలుకుబడి ఉన్నవారు కొత్తవారి టాలెంట్‌ను తొక్కేస్తూ, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సినిమా రంగంలో సానుకూల మార్పులు చాలా నెమ్మదిగా సాగుతుండటం తనకు ఎంతో నిరాశ కలిగిస్తోందని... అయినప్పటికీ ఇండస్ట్రీలో మహిళల హక్కుల కోసం, పని చేసేందుకు అనువైన మంచి వాతావరణం కోసం తమ మహిళా సంఘం చేస్తున్న పోరాటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేది లేదని పార్వతి స్పష్టం చేశారు.

## యాక్షన్ మోడ్‌లోకి మెగాస్టార్..

### హైదరాబాద్‌లో 'మెగా158' భారీ ఫైట్ సీక్వెన్స్ షురూ

మెగాస్టార్ చిరంజీవి తన 158వ సినిమా కోసం యాక్షన్ మోడ్‌లోకి ప్రవేశించారు. దర్శకుడు బాబీ కొల్లితో ఆయన చేస్తున్న ఈ ప్రాజెక్టులో ఓ భారీ యాక్షన్ ఘట్టం చిత్రీకరణ మొదలైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న రెండో షెడ్యూల్‌లో భాగంగా ప్రముఖ స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ సారథ్యంలో ఈ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఈ యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులకు వింటేజ్ చిరంజీవిని గుర్తుకు తెచ్చేలా ఉంటాయని చిత్ర యూనిట్ చెబుతోంది.



'మెగా158' (వర్కింగ్ టైటిల్) రెండో షెడ్యూల్ జూన్ 22న హైదరాబాద్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీనిపై నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ గతంలోనే ప్రకటన విడుదల చేసింది. "పొల్లాచ్చి అందాల నుంచి మరో భారీ ఘట్టంలోకి అడుగుపెట్టాం. మెగాస్టార్ ప్రతి షాట్‌ను ఓ ఉత్సవంగా మారుస్తున్నారు" అని పేర్కొంది. అంతకుముందు తమిళనాడులోని పొల్లాచ్చిలో తొలి షెడ్యూల్‌ను చిత్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు.

'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల యువనటి అనస్వరా రాజన్‌ను చిత్ర బృందంలోకి అధికారికంగా స్వాగతించారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, 'జైలర్' ఫేమ్ విజయ్ కార్తీక్ కణ్ణన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. కొల్లా అవినాశ్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గత ఏడాది చిరంజీవి పుట్టినరోజున ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ పాత్ర కోసం చిరంజీవి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న వీడియోను పంచుకుని అభిమానులను ఉత్సాహపరిచారు. 'ది బ్లేడ్ దట్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com